దురాశ దుఃఖములకు చేటు

శ్రీరామచరిత మానసము లోని కథ

కైకయ రాజైన ప్రతాపభానుడు సద్గుణసంపన్నుడు మరియు గొప్పయోధుడు. అతని ప్రియసోదరుడు అరిమర్దనుడు. అరిమర్దనుడు మహాబలశాలి వీరుడు. ప్రతాపభానుని మంత్రి ధర్మరుచి. అతడు నీతజ్ఞుడు బుద్ధిమంతుడు రాజనీతిలో శుక్రుని తోటివాడు శ్రీహరిభక్తుడు రాజుకు హితైషి. దిగ్విజయయాత్రలో ఆ రాజు సప్తద్వీపాలనూ జయించి సమస్త భూమండలమునకు ఏకైకచక్రవర్తి అయ్యాడు. మంత్రి అయిన ధర్మరుచి ప్రభావమువలన ఆ రాజు గురువులను దేవతలను సాధుసజ్జనులను పితరులను భూసురులను భక్తివిశ్వాసాలతో సేవించుచుండెడివాడు. రాజధర్మములను వేదోక్తముగా పాటిస్తూ నిత్యమూ అనేక దానధర్మాలు చేసేవాడు. పురాణేతిహాసములను భక్తిశ్రద్ధలతో వినేవాడు. ఎన్నో బావులు చెఱువులు ఉద్యానవనాలు దేవతామందిరాలు కట్టించి ప్రజారంజకముగా రాజ్యపాలన చేసేవాడు.

వనాలలో ఆశ్రమములను నిర్మించుకొన్న మహర్షులు తమ తపశ్శక్తిలో ఆఱవభాగము రాజులకు ధారపోస్తారు. ఆ శక్తితో రాజులు ధర్మబద్ధముగా రాజ్యపాలన చేయుచుందురు. కావున లోకహితైషులైన మహర్షులను క్రూరమృగములనుండి కాపాడడంటం రాజుల విధి. ఒకసారి ప్రతాపభానుడు వింధ్యాటవికి శాస్త్రప్రకారము చంపదగిన మృగములను వేటాడుటకై వెళ్ళెను. ఆ సుందరారణ్యములో ఒక పెద్ద అడవిపందిని చూసి దానివెంటబడ్డాడు రాజు. ఆ వనవరాహము ఎంత ప్రయత్నించినా తనకి చిక్కలేదు. ఎంతో దూరం పరుగెత్తి ప్రవేశించుటకే దుర్గమమైన ఘనారణ్యములోకి వెళ్ళిపోయింది ఆ వరాహము. ధీరుడైన ప్రతాపభానుడు తనప్రయత్నం మానక ఆ దట్టమైన అడివిలోకి ఏకాకిగా ప్రవేశించాడు. చివరికి ఆ వరాహం ఒక గుహలోకి దూరింది. గుహలోకి వెళ్ళుటకు వీలులేక నిరాశతో ప్రతాపభానుడు వెనుకకు మఱలాడు. కాని ఆ ఘోరారణ్యములో దారితప్పిపోయాడు.

ఆ వనములో తిరిగి తిరిగి బాగా అలసిపోయి ఒకచోట సొమ్మసిల్లి పడిపోయాడు. కొంతసేపటికి తేరుకుని నిర్మానుష్యమైన అడవిలో ఒక ఆశ్రమాన్ని కనుగొన్నాడు. ఆ ఆశ్రమము ఒక కపటసన్యాసిది. ఆ కపటవేషధారి పూర్వం ప్రతాపభానునిచే యుద్ధములో ఓడిపోయి పాఱిపోయిన శత్రురాజు. హృదయములో ప్రతాపభానునిపై ద్వేషమును నింపుకొని ఆ అడవిలో ఉంటున్నాడు. ప్రతాపభానుని చూడగానే అతనిని గుర్తుపట్టాడు. కానీ అలసిపోయి ఉన్న ప్రతాపభానుడు వాడిని గుర్తించలేదు! దాహముతో బాధపడుతున్న రాజుకు ఒక సరోవరం చూపించాడు. ప్రతాపభానుడు సరోవరములో స్నానముచేసి శుచి అయ్యి నీరు త్రాగినాడు. ప్రతాపభానుని ఆశ్రమములోపలికి ఆహ్వానించాడు ఆ కుహనాసన్యాసి. "నాయనా! నీవెవఱు? ప్రాణాలకు తెగించి ఈ ఘోరాటవిలోకి ఎందులకు వచ్చావు"? అని అడిగినాడు కపటసన్యాసి. రాజనీతి తెలిసిన ప్రతాపభానుడిలా సమాధానమిచ్చినాడు "ఓ మహాత్మా! మీ సహాయమునకు కృతజ్ఞుడను. నేను ప్రతాపభానుడనే రాజు యొక్క మంత్రిని. వేటకై వచ్చి తప్పిపోయాను. నీ దర్శభాగ్యము కలుగుట నా అదృష్టము". "ఓ సజ్జనుడా! బాగా చీకటి పడినది. నీ రాజ్యము ఇక్కడికి డెబ్బది యోజనములున్నది. కావున నీవు ఈ రాత్రికి నా ఆశ్రమములో విశ్రాంతి తీసుకుని రేపు వెళ్ళు" అని చెప్పాడు ఆ కపటుడు. సన్యాసి దయాగుణాలను ఎన్నో విధాల పొగిడి ఆ రాత్రికి అక్కడే ఉండటానికి నిశ్చయించుకున్నాడు రాజు.

మాయమాటలతో రాజును తనను నమ్మేలాచేసి ఈర్ష్యాగ్నితో కాలిపోతున్న ఆ కపటసన్యాసి నిర్మలుడైన ప్రతాపభానుడు అర్థించుటచే తన వృత్తాంతమును ఇలా చెప్పసాగాడు "సోదరా! వినుము. నేనిచట చాలా కాలముగా ఉంటున్నాను. ఇంతవఱకూ నా వద్దకు ఎవరూ రాలేదు. నా గురించి నేనెవరికీ చెప్పుకోలేదు. లోపప్రతిష్ఠ తపస్సును దగ్ధముచేసే అగ్నివంటిదికాదా! అందుకనే ప్రపంచానికి దూరముగా ఉంటున్నాను. శ్రీహరితో తప్ప నాకింకెవరితోను పనిలేదు". వైరాగ్యబుద్ధి కలిగి శ్రీహరిభక్తుడై ఉన్నాడని తెలియగానే ప్రతాపభానునికి ఆ బకధ్యానిమీద గౌరవం పెరిగిపోయింది. ప్రతాపభానుడు పూర్తిగా తన వశుడైనాడని తెలుసుకొని "పుత్రా! నా పేరు ఏకతనుడు. సృష్టిప్రారంభములో నేను

జన్మించాను. తరువాత మఱియొకదేహము దాల్చలేదు అందుకే నన్ను ఏకతనుడంటారు". ఆశ్చర్యముగా వింటున్న ప్రతాపభానునికి అప్పుడు కపటసన్యాసి ఎన్నో ప్రాచీనగాథలు పురాణేతిహాసములు సృష్టిస్థితిలయములను గూర్చిన వింత వింత కథలెన్నో చెప్పాడు. జ్ఞానవైరాగ్యాల మీద వ్యాఖ్యానాలిచ్చాడు. ఇవన్నీ విని పరవశుడై రాజు "స్వామీ! నేను ప్రతాపభానుడను" అని చెప్పాడు. "రాజా! గురుకృపవల్ల నాకు అంతా తెలుసు. మీ తండ్రి పేరు సత్యకేతువు. నీ రాజనీతి మెచ్చుకుంటున్నాను. తెలియని వానితో పేరు చెప్పిన రాజ్యమునకే అపాయము అని తెలిసి నీవు ఇందాక నీ పేరు చెప్పలేదు. నేనెంతో ప్రసన్నుడనైనాను. నీకొక వరమిస్తాను కోరుకో" అని అన్నాడు ఆ కపటసన్యాసి.

సద్గుణ సంపన్నుడైనా ప్రతాపభానునకు ఒక తీరనికోరిక ఉండేది. దురాశ అనే హాలాహలముచే బాధింపబడుతున్న ఆ రాజు ఇలా కోరాడు "ఓ దయాసాగరా! నా శరీరము జరామరణదుఃఖ రహితమగుగాక. యుద్ధములో నన్నెవరూ జయింపకుండు కాక. భూమిపై నూఱుకల్పములు నా ఏకచ్ఛత్రాధిపత్యము నిలిచియుండుగాక". ధర్మరుచి ప్రభావము వలన తాను చేసే కర్మ అంతా శ్రీహరికి అర్పించి "సర్వం కృష్ణార్పణమ్" అని అంటున్నా ప్రతాపభానుడు ఆ సూక్తిలోని ఆంతర్యమును అర్థంచేసుకోలేదు. పూర్వం హిరణ్యకసిపుడు కోరిన వరము పెలెనున్న ఈ దురాశాభూయిష్టమైన వరమును కోరినాడు. నిజమైన సన్యాసి అయితే ఈ కోరిక విని "నాయనా! ఈ శరీరము శాశ్వతము కాదు. ఎందులకు దీనిమీద ఇంత మక్కువ? భగవద్భక్తి ఒక్కటే శాశ్వతము శ్రీహరిని శరణు వేడు" అని హితవు చెప్పేవాడు. కానీ కపటుడగుటచే ఆ సన్యాసి "తథాస్తు. నిన్ను సర్వప్రాణులనుండి కాపాడతాను. నా ప్రభావం వల్ల యముడు కూడా నీ దగ్గరకు రాలేడు. కానీ ఒక్క విప్రశాపం నుండి నేను నిన్ను రక్షించలేను" అని అన్నాడు. "గురూత్తమా! విప్రులను ప్రసన్నము చేసుకునే ఉపాయము దయతో నాకు సెలవీయ్యండి" అని ప్రార్థించాడు రాజు. "సరే. కానీ నీవీ విషయము చాలా రహస్యముగా ఉంచాలి. నన్ను కలుసుకున్నట్టు ఎవరితో నైనా చెపితే నీకు బహుదుఃఖములు కలుగుతాయి. నీ మంచి కోరే చెపుతున్నాను. మూడోకంటికి ఈ విషయము తెలిసిందా నీవు నశిస్తావు" అని అన్నాడు సన్యాసి.

"గురువర్య! త్రిమూర్తులు కోపగించినా గురు రక్షిస్తాడు కానీ గురుపే కోపిస్తే రక్షించేవాడుండడు. మీ ఆజ్ఞ అతిక్రమించను. ఆజ్ఞ ఇవ్వండి. శిరసావహిస్తాను" అని అన్నాడు ప్రతాపభానుడు. ఆహా! ఆశ ఎంత దారుణమైనది! ఇన్ని ఏండ్లుగా విద్యాబుద్ధులు నేర్పించి సంస్కారాన్ని ప్రసాదించిన తన నిజగురువును ఒక్క నిమిషములో వదిలేసి కపటసన్యాసి గురించి ఏమీ తెలియకుండానే వాడిని నమ్మి "గురూత్తమా!" అని సంబోధించేలా చేసింది. అప్పుడు ఆ బకధ్యాని "విప్రులను స్వాధీనపఱచుటకు అనేక మార్గములు కలవు. నీకు అన్నిటికన్నా సులభమార్గము చెప్పెదను. ఒక సంవత్సరముపాటూ ప్రతిరోజు లక్షమంది ఉత్తములైన విప్రులను కుటుంబసహితముగా అహ్వానించు. నేను నా తపశ్శక్తిచే మీ పురోహితుని వేషముదాల్చి వారికి వండిపెట్టెదను. ఇప్పుడు నీవు విశ్రాంతి తీసుకో. నా తపశ్శక్తిచే నిన్ను నీ అంతఃపురములో చేరుస్తాను. సరిగ్గా మూడు రోజుల తరువాత నీ పురోహితుని రూపములో నీకు దర్శనమిస్తాను. అన్ని ఏర్పాట్లు చేసివుంచు" అని అన్నాడు. రాజు ఎంతో సంతోషించి బాగా అలసిపోయినందు వలన గాఢనిద్రపోయాడు.

ఇంతలో కపటసన్యాసి స్నేహితుడైన కాలకేతు రాక్షసుడు వచ్చాడు. వాడే వరాహవేషము దాల్చి ప్రతాపభానుని దారిమఱల్చినాడు. స్త్రీలను సజ్జనులను దేవతలను హింసిస్తున్న కాలకేతు నూర్గురుకుమారులను పదిమంది సోదరులను యుద్ధములో చంపి దుష్టసంహారం చేశాడు ప్రతాపభానుడు. దీనిని గుర్తుపెట్టుకుని అతనిపై ద్వేషం పెంచుకున్నాడు కాలకేతువు. కపటసన్యాసి కాలకేతువు కలిసి నాటకమాడి ప్రతాపభానుని నాశనం చేయదలచారు! కాలకేయుడు తన మాయతో ప్రతాపభానుని అంతఃపురంలో చేర్చి పురోహితుని ఒక గుహలో బంధించి తానే పురోహితునిగా కామరూపం ధరించాడు. తరువాతరోజు ప్రతాపభానుడు నిద్రమేల్కొని తాను అంతఃపురములో ఉన్న విషయము గ్రహించి ఆ కపటసన్యాసి శక్తిని చూసి ఆశ్చర్యపోయాడు. మూడురోజులు క్షణమొక యుగముగా గడిపినాడు. శ్రీహరి ధ్యానం వదిలి ప్రతిక్షణం ఆ కుహనాసన్యాసి పాదాలనే ధ్యానించసాగినాడు.

అనుకున్న ప్రకారం లక్షమంది ఉత్తమ విప్రులను ఆహ్వానించాడు ప్రతాపభానుడు. ఆ కుహనాపురోహితుడు తన మాయచేత లెక్కలేనన్ని వ్యంజనములు నాలుగురకాలైన వంటలను పాకశాస్త్రమును అనుసరించి షడ్రసోపేతముగా సిద్ధంచేసినాడు. కానీ వానిలో అనేకజంతువుల మాంసములేకాక బ్రాహ్మణులమాంసము కూడా కలిపి వడ్డించినాడు. భోజనార్థము విప్రులు సిద్ధమగుతుండగా కాలకేతుడు ఆకాశవాణిని సృష్టించి "ఓ విప్రోత్తములారా! ఈ భోజనము హానికరము. దీనిలో జంతువిప్ర మాంసమున్నది. దీనిని భుజింపవద్దు" అని పలికించెను. ఆకాశవాణి వినగానే ఆ లక్షమంది విప్రులు "ఓ క్షత్రియాధమా! మమ్ము సపరివారముగా భ్రష్టులను చేయ తలచితివి. నీవుకుటుంబ సహితముగా రాక్షసుడపై జన్మించు. ఒక్క సంవత్సరములో నీవు నీవంశంతో సహా నశిస్తావు. మీకు తిలోదకాలిచ్చెడివారు కూడా ఉండరు" అని ఘోరశాపాన్నిచ్చారు. తమయుక్తి సఫలమైనదని కాలకేతుడు కపటసన్యాసి సంతోషించారు. కపటసన్యాసి శత్రురాజులందఱిని కూడబెట్టుకోని ప్రతాపభానునిపై దండెత్తినాడు. వీరుడైన రాజు అరిమర్దనుడు ఎంతో కాలం వారితో యుద్ధం చేశారు. చివరికి ఒక సంవత్సరం తరువాత తన వంశముతో సహా ప్రతాపభానుడు నశించినాడు. కొలది కాలము తరువాత వారందఱూ రాక్షసులై జన్మించినారు. ప్రతాపభానుడు రావణునిగా అరిమర్దనుడు కుంభకర్ణునిగా ధర్మరుచి విభీషణునిగా జన్మించిరి. ఒకానొక కల్పములో శ్రీరామావతారమునకు ఇదియే నాంది.

పిల్లలూ! ఈ కథలోని నీతులను మరొక్కమాఱు చూద్దాము:

౧. మానవునకు ఆశ ఉండవచ్చు. కాని "అతి సర్వత్ర వర్జతే". సమస్త భూమండలానికి ఏకచ్ఛత్రాధిపతి అయికూడా ప్రతాపభానుడు కపట సన్యాసిని అడగరాని వరంకోరి చివరికి నాశనమైనాడు.

౨. మన శాస్త్రాలలో గురువుని ఎలా పెతకాలో వివరించారు. ఎంతో అన్వేషించి ఉత్తముడైన వానిని గురువుగా స్వీకరించాలి. ప్రతాపభానుడు తన దురాశ వలన ఒక్క రాత్రి పరిచయంతోసే కపటుని గురువుగా స్వీకరించాడు.

౩. బహిశ్శత్రువులైనా అంతశ్శత్రువులైనా (కామ క్రోధాదులు) హాని చేయకమానవు. కావున ఎల్లప్పుడూ అప్రమత్తులమై ఉండాలి. ప్రతాపభానుడు శత్రువులైన కాలకేతు కపటసన్యాసులను గమనించక వారిచేత మోసగించబడినాడు.

మాలాగా మారిపోవద్దు

సి. ఆనందారామం

గూడెంలో చిన్నా పెద్దా అందరూ రచ్చబండ దగ్గిర మూగారు. ఏదో గలాటా జరుగుతోంది. గట్టిగా గొంతులూ, కేకలూ వినిపిస్తున్నాయి, ఆడవాళ్లలో కొందరు వాదిస్తున్నారు.

'మళ్ళీ ఏదో గొడవ' అనుకుంది సరోజిని. వాళ్లలో వాళ్లకు అప్పుడప్పుడు ఏదో తగాదా రావటమూ, రచ్చబండ దగ్గర చేరి పెద్దల ద్వారా తగవు పరిష్కరించుకోవటమూ వాళ్లకు మామూలే!

ఈ సారి సరోజినీని ఆశ్చర్యపరచింది రచ్చబండ దగ్గిర చేరిన జన సమూహం - గూడెం గూడెం అంతా అక్కడే ఉంది, ఆడవాళ్ళు పిల్లలూ కూడా ఉన్నారు. సాధారణంగా తగవుకు సంబంధించినవాళ్లు మరికొందరు పెద్దమనుష్యులూ మాత్రమే ఉంటారు.

కొంచెం దగ్గరగా వెళ్ళి అంతమంది మధ్య దోషిలా తల వంచుకుని నిలబడ్డ వ్యక్తిని చూసి నిర్ఘాంతపోయింది సరోజిని - అతడు అగ్గిదొర-

అగ్గిదొర అతని అసలుపేరు కాదు - గూడెం అంతా కలిసి అతని స్వభావాన్ని బట్టి భయ గౌరవాలతో పెట్టుకున్న పేరు.

గూడెం పెద్ద అగ్గిదొర - గూడెంలో వాళ్ళది అదొక కట్టు. వాళ్ళకు పెద్ద అంటే మహారాజే! మామూలు మురికి ధోవతి, పైన చొక్కా, ఆకు చెప్పులు. అవతారం ఇదే అయినా అధికారం మాత్రం రాజాధిరాజుదే! అతని మాటకు అడ్డులేదు - అతని తీర్పుకు ఎదురులేదు - అతని మాట కాదని ఆ గూడెంలో ఎవరూ బ్రతకలేరు. అతని శాసనం అలాటి చండశాసనం - అందుకే అగ్గిదొర అయ్యాడు.

అలాంటి అగ్గిదొర ఈనాడు నలుగురిముందు తల వంచుకు నిలబడ్డాడు - కొందరు ఏదేదో మాట్లాడుతున్నారు - కానీ అసలు విషయం అర్థం కావటం లేదు.

అంతలో సరోజిని దృష్టి అక్కడున్న మరో వ్యక్తి మీద పడింది. ఆవిడ సుమారు ఇరవైయేళ్ళలోపు యువతి. గూడెం మనిషిలా లేదు - వేషంలో కొద్దిపాటి నాగరికతవుంది నడుంమీద వేలాడే వెండి వడ్డాణం లేదు - జుట్టు ముడివేసుకోలేదు - పరికిణీ ఓణీ వేసుకుంది. రెండు జడలు - మెడలో ఏదో పూసల దండ . వేషంలోవున్న నాగరికత మొహంలో కనబడటం లేదు. పనిపాటలు చేసుకునే కూలిజనానికి చెందిన మనిషని స్పష్టంగా తెలుస్తోంది.

సరోజినికి గూడెంలో ఆడవాళ్ళందరూ తెలుసు - అక్కడ టీచర్‌గా ఆవిడ పిల్లలకు పాఠాలు చెప్పటం మాత్రమే కాదు - ఇంటింటికీ వెళ్ళి పిల్లలను బడికి పిలుచుకురావడం కూడా ఆవిడ కార్యక్రమంలో ఒక భాగం. ఆ సందర్భంలో పాపం ఆవిడ చచ్చినట్లు గూడెం ఆడవాళ్ళను బ్రతిమాలి బ్రతిమాలి వాళ్ళ పిల్లలను బడికి తీసుకెళ్ళవలసి వచ్చేది.

ఆ గుంపులో ఒకావిడను పిలిచి "ఏయ్! మహాలక్ష్మీ! ఏం జరిగిందే? మీ పెద్దనే విచారణ చేస్తున్నారెందుకూ?" అని అడిగింది.

ఆ మహాలక్ష్మి ముఖం వికారంగా చేసుకుని కాండ్రించి ఉమ్మి "ఇంకా ఆడేం పెద్ద? బోడి పెద్ద"అంది.

పెద్ద పేరు చెపితేనే గజగజ వణుకుతారు పెద్ద పెద్ద మొగవాళ్లుకూడా. . . అలాంటిది ఒక ఆడమనిషి ఇలా మాట్లాడుతోంది.

"ఏం చేశాడు వివరంగా చెప్పు."

"ఇంకా ఏటి సెయ్యాలమ్మా! కట్టుదప్పినాడు - దాన్నెవతెనో తీసుకొచ్చి యింట్లో బెటాడంట! ఏమయిపోవాల రత్తాలమ్మ?"

అదా సంగతి! బస్తీ పిల్లలా కనబడుతోన్న ఆ మనిషిని అగ్గిదొర తీసుకొచ్చాడన్నమాట!

ఆ పిల్లని అగ్గిదొర తీసుకురావటంలో విచిత్రమేమీ కనబడలేదు సరోజినికి - ఆ విషయాన్ని గూడెమంతా ఇంత తీవ్రంగా నిరసించటం - పెద్దనే దోషిగా నిలబెట్టటం మాత్రమే విచిత్రంగా తోచాయి.

రత్తాలమ్మ అగ్గిదొర భార్య అని సరోజినికి తెలుసు - ఎప్పుడూ మూలుగుతూ మంచంలో పడుకునే రత్తాలమ్మతో సరోజిని ఎక్కువగా ఏది మాట్లాడలేదు. రత్తాలమ్మకి ఆరుగురు పిల్లలు - ఏదో కాన్పులో జబ్బుచేసి మంచమెక్కింది. ఇంటిపనంతా పెద్దకూతురు చూస్తూ ఉంటుంది. మూడొంతులు మంచంలోనే మూలుగుతూ పడివుంటుంది రత్తాలమ్మ. ఒకప్పుడు అందంగా ఉండేదామె!

కానీ ఈనాడు అస్థిపంజరంలా తయారయింది. కళ్ళు లోతుకు పోయి గుంటలుపడ్డాయి. దవడలు కొద్దిగా వేలాడుతున్నాయి. స్నానపానాదులు సరిగ్గా లేకపోవటంతో పాటు అనారోగ్యంతో మనిషి దగ్గిర దుర్గంధం.

అగ్గిదొర పూలరంగడిలా ఉంటాయి - కాయకష్టం చేసే శరీరం బలిష్టంగా ఉంది. వయసు ఎంతో కానీ సడలని యవ్వనంలో కనిపిస్తాడు - ఈ సందర్భంలో అగ్గిదొర మరొకదాన్ని తెచ్చుకోవటంలో ఆశ్చర్యమేముందీ?

అయితే ఈ విషయం గూడెం ఇంతగా నిరసిస్తోందా? నీతి నియమాలు ఇంత దృఢంగా ఉన్నాయా, ఈ వెనుకబడిన వర్గంలో - కుతూహలంగా పెద్దల మాటలు వినసాగింది.

"అదెవర్తి! దాన్ని మన మద్దిన పెడతావేంటి? పెళ్ళామయితాది అది? గూడెం బయట గుడిసేసి ఉంచుకో! ఒకళ్ళనేటి? పదిమందిని ఉంచుకో! ఎవడొద్దన్నాడు? నువ్వు యెల్లిరా! నీలాగా అందరూ యెల్తారు ఆడికీ. ఊరి సొత్తు ఇల్లాంటి ఆడాళ్ళు - అంతేగాని పెళ్ళాంతో పాటు ఇంట ఉంచుతావు? సిగ్గింత లేదయ్యా! థూ. . ."

ఈ మాట విన్న ఆ పిల్ల రోషంతో బుసలుకొట్టింది. మొహం చిన్నబుచ్చుకొని అగ్గిదొర సేపు చూసి "నేను పోతున్నా!" అంది.

అంతటి అగ్గిదొర కూడా మాట్లాడలేదు. గూడెంలో ఆడంగులు మాత్రం కోపంగా "పోయే లంజ" అన్నారు కసిగా - కొందరు గొల్లున నవ్వారు. మరికొందరు ఈలలు వేశారు.

ఆ పిల్ల కన్నీళ్ళతో అక్కడినుంచి కదిలిపోయింది. విస్తుపోయింది సరోజిని. వీళ్ళు పాప పుణ్యాలు, నీతి నియమాలు, మంచి చెడ్డలు ఇలాంటి మాటలే మాట్లాడలేదు.

కాని ఎంత చక్కగా తీర్పు చెప్పారు? అగ్గిదొర చేస్తున్నది తప్పని అనలేదు. కాని ఆ పిల్లని భార్యతో సమానంగా ఉండనియ్యలేదు. అది ఆచారం కాదు. తమ కట్టుకు విరుద్ధం.... అంతే తెలుసు వీళ్ళకి! భార్య కానిమనిషి ఊరి బయట ఉండవలసిందే.

వ్యభిచారం తప్పనటం లేదు - తమ సంఘపు కట్టుబాటు దాటడానికి వీల్లేదంటున్నారు - రోగిష్టి రత్తాలు నిశ్చితంగా మంచంలో పడుకుంది మూలుగుతూ... ...

అగ్గిదొర కోపంతో ఆ రోజు ఇంటికి రాలేదు - అయినా రత్తాలమ్మ బాధపడలేదు - ఇంటికి రాక ఏమవుతాడు? ఇవాళ కాకపోతే రేపొస్తాడు - ఈ ఇల్లు తనది! ఈ పిల్లలు తనవాళ్ళు, ఇది తన సామ్రాజ్యం.

జరిగింది తలుచుకొంటున్న కొద్దీ సరోజిని మనసులో చెప్పరానంత బాధగా ఉంది.

తన దురదృష్టం కొద్దీ వాళ్ళమధ్యకు వచ్చి పడ్డాననుకునేది..... రెండు రోజులకొకసారిగాని స్నానం చెయ్యకపోవటం, తలల్లో పేలు చూసుకోవటం, నోట్లో తాంబూలం నమలటం. . . ఇలాంటి అలవాట్లన్నీ అసహ్యించుకునేది - మనుష్యులలో మొరటుతనం భరించలేకపోయేది - చదువుమీద ఏ మాత్రం శ్రద్ధ లేని ఆ అజ్ఞానాన్ని చీదరించుకునేది! "వీళ్ళు మృగాలు" అనుకుంది ఎన్నోసార్లు మనసులో.

కానీ తాను ఏ సమాజంలోనుండి వచ్చిందో! ఆ సమాజం ఎలాంటిది?

సరోజిని చదువుకున్నది. అందమైనది - బుద్ధిమంతురాలు - తండ్రి పదివేలు కట్నంతో ప్రభాకరరావుకిచ్చి పెళ్ళి చేస్నాడు - రతీమన్మదుల్లా ఉన్నారని అందరూ పొగిడారు - సరోజిని అదృష్టాన్ని చూసి ఎందరో ఈర్ష్యపడ్డారు - సరోజిని కూడా తన అదృష్టాన్ని చూసుకుని ఎంతో ఆనందించింది. అయితే ఆ ఆనందం ఎంతో కాలం నిలవలేదు - ప్రభాకరరావు మరో వన్నెల విసనకర్రతో జత కలిపాడు - బాహాటంగా ఇంటికే తీసుకొచ్చాడు.

భరించలేకపోయింది సరోజిని "ఆవిడని ఇంట్లో ఉంచితే నేను ఉండను" అంది తిరగబడి - సరోజిని కోపాన్ని కాని, ఆవేదనను కాని ప్రభాకర రావు ఏ మాత్రం లక్ష్యపెట్టలేదు -

"పోతే, పో!" అన్నాడు విసుగ్గా. భరించరాని దు:ఖం వచ్చింది సరోజినికి - గుండెలు పగిలేలా ఏడ్చింది. అంతమాట అనిపించుకున్నాక అక్కడ ఇంకా ఎలా ఉండగలదు?

బయలుదేరి పుట్టింటికొచ్చింది. పుట్టింటిలో ఒక్కరు కూడా సరోజిని ఆవేదనను అర్థం చేసుకోలేదు - సరిగా ఆదరించలేదు.

"మొగాళ్ళు ఏదో కక్కు ర్తి పడతారు - నువ్వు కూడా ఇలా తొందరపడి ఇల్లొదిలొస్తే ఎంత అప్రతిష్ఠ? ఇంకా పెళ్ళి కావలసిన చెల్లెళ్ళున్నారు నీకు!" అంది తల్లి మెత్త మెత్తగా.

"ఏదో నాలుగురోజులుండు, నేను వ్యవహారాలు చక్కబరుస్తాను -" అన్నాడు తండ్రి ధైర్యం చెపుతున్నట్లుగానే అక్కడ ఎక్కువరోజులు ఉండకూడదని హెచ్చరిస్తూ.

సరోజినిని చూడగానే వదిన గుండె గతుక్కుమంది. ఇక జీవితాంతమూ ఆడబిడ్డను తామే భరించవలసి వస్తుందేమోనని భయం బయలుదేరింది.

"వేలు వేలు కట్నాలు గుమ్మరించి పెళ్ళిళ్ళు చేసింది చాలక ఇదొకటి! తమ ఇంట్లో తాము నిభాయించుకోలేరు కాని, పుట్టిళ్ళకొచ్చి వదినమీద పెత్తనాలు చెలాయిస్తారు. అయినా మొగాణ్ని కట్టేసుకునే నేర్పు ఆడదానికుండాలి! ఏ లోపమూ లేకపోతే ఇల్లాల్ని వొదిలి బజారున ఎందుకు పడతాడు?" - ఇలాంటి సూటిపోటి మాటలు మితిమీరిపోయాయి.

అక్కడ ఎక్కువ రోజులు ఉండలేకపోయింది సరోజిని. ఎవరికీ తెలియకుండా ఉద్యోగం చూసుకుని వచ్చేసింది. అయినా సరోజినిని సమస్యలు వదలలేదు. ఎక్కడకెళ్ళినా ఒకటే ప్రశ్న? - ఒక్కదానివే ఉన్నావేం? మొగుడెందుకు వొదిలేశాడు? నువ్వే వదిలేశావా? అతడే వొదిలేశాడా?" లాటివి -

ఈ ప్రశ్నలను వెన్నంటి అనుమానపు చూపులు - వంకర నవ్వులు - వ్యంగ్య వాగ్బాణాలు. . .

ఇదంతా భరించలేక మారుమూల గూడెంలో చిన్న బళ్ళోకి ఒకే ఒక టీచర్‌గా వచ్చేసింది సరోజిని. గూడెంలో అందరూ సరోజినిని వింతగా చూసేవారు. ఆవిడను ఏమన్నా ప్రశ్నించటానికి వాళ్ళకు సాహసం ఉండేది కాదు. అక్కడ ఒక విధంగా ప్రశాంతంగా రోజులు వెళ్ళదీస్తోంది సరోజిని.

స్కూల్లో పిల్లలందరిలో తెలివైనవాడు నర్సింహులు - చదువులోకూడా వాడికే శ్రద్ధ ఎక్కువ.

"నువ్వు బాగా చదువుకోవాలి! మాలాగా మారిపోవాలి" అనేది సరోజిని వాడిని పొగుడుతూ. ఆ మాటలకు పొంగిపోయేవాడు.

ఎప్పటిలా ఆరోజు కూడా వాడు లెక్కలన్నీ కరెక్టుగా చేశాడు

"చాలా బాగా చేశావురా! నువ్వు చాలా పైకొస్తావు" అని మెచ్చుకొంది సరోజిని.

"బాగా చదువుకుని నేను మీలా మారిపోతాను టీచరమ్మగారు!" అన్నాడు వాడు సంబరంగా.

నిజాయితీ

స్వాతంత్ర్య సమరయోధులనాటి కథ

భారతదేశపు వైద్య విధానం ఆయుర్వేదం. బ్రిటిషర్లు మనదేశాన్ని ఆక్రమించి వారి వైద్యవిధానమైన అల్లోపతి ని ప్రవేశపెట్టకముందు ఆయుర్వేదం చాలా ప్రాముఖ్యంలో ఉండేది. కాని బ్రిటిషర్ల పాలనవలనో మనలో అలవాటైన బానిస భావన వలనో మెల్లిమెల్లిగా ఆయుర్వేదం యొక్క ప్రాముఖ్యత తగ్గిపోయింది. చాలామంది ఆయుర్వేదం పనికిరాదని తోసిపేశారు. అట్టి కాలంలో బెంగాలుకు చెందిన ఓ ప్రముఖ విద్యావేత్త ఆయుర్వేదాన్ని కాపాడుకోవటానికి నడుంకట్టాడు. ఆంగ్ల ఔషధాలకు దీటుగా దేశీయ ఔషధాలు తయారుచేసే ఒక సంస్థను స్థాపించాడు.

అలా ఎంతో కష్టపడి ప్రతికూలమైన పరిస్థితులలో సంస్థని నడుపుతుండగా ఒకనాడు ఆ విద్యావేత్తకు ఒక భీషణమైన సమస్య ఎదురయ్యింది. ఆ సంస్థ తయారు చేసిన ఎన్నో మందులు ఏదో కారణముగా పాడైపోయాయి. ఆ విద్యావేత్త ఎంతో దుఃఖించాడు. అతని విచారం చూసి అక్కడే ఉన్న ఓ ఉద్యోగి ఇలా పలికాడు "అయ్యా! మీరు విచారించకండి. ఇంకా ఈ మందులు పూర్తిగా పాడు అవ్వలేదు. ఇంకొన్నాళ్ళు సునాయాసంగా మనం వీటిని అమ్మవచ్చు. అట్లు చేయకున్న మనకు చాలా నష్టం వస్తుంది. ఆయుర్వేదాన్ని కాపాడుకోవాలన్న మీ ఆశయం కూడా అప్పుడు నెరవేరక పోవచ్చు".

ఇటువంటి అవినీతి భరితమైన మాటలు విని ఆ విద్యావేత్త మండిపడుతూ ఇలా జవాబిచ్చాడు "నష్టమొస్తుందని పాడైపోతున్న మందుల్ని అమ్ముతామా? అట్టి నీచమైన కార్యాన్ని నేనెన్నడూ చేయలేను. ఆయుర్వేదం ధర్మం ఉన్నచోటే ఔషధాలు పనిచేస్తాయని చెప్పింది. కనుక నా ఆశయం ధర్మస్థాపనే". అలా హితబోధ చేసి ఆ మందులన్నిటిని బయటపడ వేయించి తన ఆదర్శాన్ని కాపాడుకొన్నాడు. తరువాత ఆ విద్యావేత్త లోని నిజాయితీని అందరూ కొనియాడారు.

ఆ ప్రసిద్ధ విద్యావేత్త ఆచార్య ప్రఫుల్ల చంద్ర రాయ్. భారతీయుల యొక్క విజ్ఞానము గూర్చి ప్రపంచానికి తెలుపుతూ ఈయన ఎన్నో వ్యాసాలు వ్రాసినారు. అనే వ్యాసం మనమందరం చూడదగినది. ఈ వ్యాసంలో ప్రఫుల్ల చంద్ర గారు మన భారతదేశం ఆధ్యాత్మికత బోధించడంలోనే కాదు విజ్ఞాన పరంగా కూడా ఎంతో ముందున్నదని చెబుతారు.

పిల్లాలూ! ఈ కథలోని నీతులను మరొక్కమాఋ చూద్దాం:

౧. నిజాయితీ యొక్క ప్రాముఖ్యత మనమీ కథలో తెలుసుకొన్నాము. ఎంత నష్టమైనా రాని ఏమైనా కానీ ఎన్నడు అవినీతికి పాల్పడరాదని శ్రీ ఆచార్య ప్రఫుల్ల చంద్ర రాయ్ గారు మనకు చూపించారు.
౨. మన స్వదేశీ విజ్ఞానం యొక్క గొప్పతనం చంద్ర గారి వ్యాసాల ద్వారా తెలుసుకొన్నాము.

రామయ్య ఎడ్లు

పెద్దలు చెప్పిన నీతికథ

రామయ్య ఒక సాధారణ రైతు. దైవికముగా తనకి ఉన్నంతలో సంతృప్తిగా ఉండేవాడు. అతని వద్ద మంచి నాగౌరు గిట్టలుండేవి. వాటిని తన కన్నబిడ్డలవలె కంటికిరెప్పలాగా చూసుకునేవాడు. ప్రత్యక్షంగా పరోక్షంగా మానవ జీవనానికి సహాయపడే పశుసంపదను పూజించడం భారతీయుల కృతజ్ఞతా వైభవానికి తార్కాణం. ఆ భారతీయ తత్త్వానుసారముగా రామయ్య తన ఎడ్లను పూజించేవాడు. నాగౌరు గిట్టలు అవడంచేత రామయ్య ఎడ్లలో సత్తా బాగా ఉండేది. అవి ఉత్తమ జాతి అశ్వాలకన్నా వేగముగా పరుగెత్తగలిగేవి! వాటి వేగము చూసి పుత్రోత్సాహ భావముతో రామయ్య మురిసిపోయేవాడు.

ఇలా ఉండగా ఒక రోజు రామయ్య వృషభాలను కొందరు దొంగలు అపహరించారు. తన ఎద్దులు లేవని తెలుసుకొన్న రామయ్య దుఃఖానికి అంతులేదు. పాపం! సొంత కొడుకు దూరమైనట్లు బాధపడ్డాడు. "రామా! నేనేమి పాపంచేశానయ్యా? ఎందుకింత పెద్ద శిక్ష? నా ఏడ్లు లేకుండా నేనెట్లా బ్రతికేది? ఆ దొంగలు నా ధనాం తీసుకుని నా ఎడ్లను వదిలిపెట్టుంటే బాగుండేది. పశుసంపద లేని ఇంట్లో లక్ష్మీదేవి ఉంటుందా? (ఉండదు)"

ఇలా పరిపరి విధాల వగచి రామయ్య రక్షకభటులకు ఫిరియాదు చేశాడు. తనుకూడా వారితో కలిసి దొంగలను వెదుక సాగాడు. చివరికి రామయ్య పాలిటి దేవతలైన వృషభాలను ఆ దొంగలు ఒక బండికి కట్టి పారిపోవడం రామయ్య రక్షకభటులు చూశారు. రామయ్య కళ్ళు సూర్యుని చూసిన పద్మాల్లాగా విచ్చుకున్నాయి. ఆనందంతో కళ్ళు చెమ్మగిల్లాయి. ఇంతలో ఆ రక్షకభటులు రామయ్య ఓ బండి ఎక్కి దొంగల వెనకాల పడ్డారు. దొంగల ఎడ్లబండీని త్వరగా అందుకుంటున్నారు రామయ్య రక్షకభటులు.

ఇంతలో రామయ్య వాయువేగంతో వెళ్ళే తన నాగౌరుగిట్టలను వాళ్ళు వెళ్ళే గుఱ్ఱబ్బండి అందుకోవడమేవిటి? అని అనుకున్నాడు. తన ఎడ్లు ఆ గుఱ్ఱాలతో ఓడిపోవటం ఇష్టంలేక పొయిన రామయ్య "ఆ ముక్కుత్రాటిని రెండు సార్లు లాగండిరా"! అని ఆ దంగలకు ఎడ్లు పూర్తి వేగముతో వెళ్ళే కిటుకు చెప్పాడు. దొంగలు ఆ కిటుకు తెలుసుకుని తీవ్రవేగాన్ని అందుకున్నారు. కొద్ది సేపటిలోనే కను మరుగైపోయారు. వచ్చిన ఒక్క అవకాశము పోయిందని విచారిస్తాడేమో అనుకున్న రక్షకభటులు రామయ్య ఆనందాన్ని చూసి ఆశ్చర్య పోయారు. ఆనందానికి కారణమేమిటని అడిగిన రక్షకభటులతో ఇలా అన్నాడు మహౌదార్యముగల రామయ్య

"అయ్యా! నా గిట్టలు ఎప్పుడూ పరుగు పందెంలో ఓటమిని చవిచూడలేదు. వాటి పేరు ప్రతిష్ఠలే నాకు ముఖ్యం. నాకు దొరికి అపజయం పొందడం కన్నా అవి విజేతలుగా నాకు దూరమైనా మేలు కదా! అవి నాకు దక్కాయనే స్వార్థబుద్ధి కన్నా అవి గెలిచాయనే విషయం నాకు ఎక్కువ సంతోషాన్ని ఇస్తుంది". తోటి మనుషులనే కాకుండా పశుపక్ష్యాదులను వృక్షములను ప్రేమభావంతో చూసే భారతీయతను రామయ్యలో నిండుగా చూసిన రక్షకభటులు రామయ్యకు నమస్కరించి వెళ్ళిపోయారు.

పిల్లాలూ! ఈ కథలోని నీతి మరొక్కమారు చూద్దామ్:
పశుసంపదను ప్రేమించి పూజించే భారతీయ తత్త్వాన్ని మనకు గుర్తుచేసిన రామయ్య ధన్యజీవి. మనకు ఆచార్యతుల్యుడు.

సుదూరంలో శుభోదయం

సి. ఆనందారామం

పార్కులో తన ఎదురుగా తల వంచుకుని కూర్చున్న సునీతను చూస్తూ చిన్నగా నవ్వి "పెళ్ళి చూపుల వరకూ నేను అనుకున్నట్లుగా ఆధునిక పద్ధతులలోనే సాగింది. ఇక ముందు మన దాంపత్యం కూడా ఇలాగే ఆధునికంగా సాగాలి!" అన్నాడు మాధవ్.

ఈ పెళ్ళిచూపులు సునీతకే వింతగా ఉన్నాయ్ - అటు పెద్దవాళ్ళూ, ఇటు పెద్దవాళ్ళూ రెండువైపులా కూర్చోవడమూ. మధ్యన పెళ్ళి కూతుర్ని కూర్చోబెట్టి అర్థం లేని ప్రశ్నలడగడమూ ఇదంతా వీల్లేదన్నాడు మాధవ్. తను పార్క్ కి వస్తానన్నాడు. పెళ్ళి కూతుర్ని కూడా పార్క్ కి తీసుకురమ్మన్నాడు - మాదవ్‌పట్ల సదభిప్రాయం ఏర్పడిన సునీత అన్న అన్నింటికీ ఒప్పుకున్నాడు. ఈ ఏర్పాటు సునీతకెంత సంతోషంగా ఉందో అంత భయంగా ఉంది. మాధవ్ మాటలకు వెంటనే సమాధానం చెప్పలేకపోయింది.

"మాట్లాడరేం?" రెట్టించాడు మాధవ్.

"ఆధునికంగా అంటే? బార్‌లకు వెళ్ళి. బాల్‌రూం డాన్స్‌లు చేస్తూ. అదా?" నవ్వింది సునీత.

"ఛ! ఛ! అదికాదు. " తడబడ్డాడు మాధవ్.

"ఆధునికంగా అంటే నా ఉద్దేశం పెళ్ళి అయిన పిల్లలు కావాలనకుండా కొంతకాలం అదీ ."

సునీత ముఖం సిగ్గుతో కందిపోయింది.

"సారీ! ముందే ఇలాంటి విషయాలు మాట్లాడుతున్నానని అనుకోకండి - ముఖ్యంగా ఇలాంటి విషయాల్లోనే ఒక Under Standings కి రావాలి. మీకు ఏమైనా అభ్యంతరముంటే "

సునీత సిగ్గుపడుతూనే సమాధానం చెప్పింది "ఇందులో అభ్యంతరానికేముందీ? ఈ రోజుల్లో అందరూ కోరుకుంటున్నదే ఇదీ!"

"అవుననుకోండి! కానీ, ఇందులో చిన్న చిక్కు ఉంది. మా అమ్మ ఒట్టి పాతకాలపు మనిషి - నా పెళ్ళి మాట తలచుకోగానే 'మనవణ్ణి' కూడా తలుచుకోకుండా ఉండదు. మా నాన్నగారు చిన్నప్పుడే పోయారు - అప్పటి నుండి మా అమ్మ నాన్నే సర్వంగా చూసుకుంటూ బ్రతికింది. అర్థం చేసుకోండి - ఆవిడ మనసు కష్టపెట్టలేను - మన ఆలోచన రహస్యంగా ఉంచుకోవాలి ".

ఆశ్చర్యంగా వింది సునీత.

"ఆవిడ అంత పాతకాలపు మనిషి అయినప్పుడు ఈ రకమైన పెళ్ళి చూపులకు

ఒప్పుకోవటం వింతగానే ఉంది".

నర్వస్‌గా కదిలాడు మాధవ్ "ఆవిడకు ఈ ఏర్పాటు తెలియదు - "

గతుక్కుమంది సునీత.

"అయితే.... ...."

"మా అమ్మ మళ్ళీ మిమ్మల్ని చూడటానికి వస్తుంది - అప్పుడు నేను రాను - 'నువ్వు చూస్తే చాలు! నేను చూడనక్కర్లేదు -' అంటాను. "

తెల్లబోయింది. మాధవ్ ఆధునిక భావాల్లోని అతి ఛాందసత్వం సునీతను అయోమయంలో పడేస్తోంది.

"ఒక వేళ మీ అమ్మగారికి ఇష్టం లేకపోతేనో?" అంది.

"ఆ భయం అక్కర్లేదు - మా అమ్మకు నచ్చేలాగ నేను నచ్చచెప్పగలను. "

సునీతకెందుకో కాస్త చికాకు కలిగింది. కానీ తన ఎదుట ఉన్న వరుడు అందగాడు - ఉద్యోగస్థుడు - అన్నిటికంటే కట్నం అడగకుండా పెళ్ళి చేసుకోవటానికి సిద్ధపడినవాడు - అందుకే ఏం మాట్లాడలేకపోయింది.

"ప్లీజ్! మీరు నాకోసం. అదీ నేనంటే ఇష్టముంటేనే - మా అమ్మతో కాస్త సర్దుకోవాలి! ముందుగానే ఇది విన్నవించుకుంటున్నాను."

అతని నిష్కపట ధోరణి సునీతకు నచ్చింది "విన్నవించుకుంటున్నాను - " అనడం నవ్వు తెప్పించింది -

"తప్పకుండా అలాగే సర్దుకుంటాను. నాకు మాత్రం పెద్దలంటే గౌరవం లేదనుకున్నారా?" అంది.

"అయితే నేను మీకు నచ్చినట్లేనన్నమాట!" హుషారుగా చిలిపిగా అన్నాడు మాధవ్.

తల వంచుకుని నవ్వింది సునీత. ఆ తరువాత వారం రోజులకే వచ్చింది వెంకటమ్మగారు. మనిషి మంచిదిలాగే ఉంది కాని చాదస్తం ఇంతా అంతా కాదు.

"పిల్ల లక్షణంగా ఉంది - మావాడు నిన్ను గురించి అంతా చెప్పాడమ్మా! నీకు నోములూ వ్రతాలూ అంటే ఇష్టంట కదూ! భజనపాటలు బాగా పాడతావుట! రామాయణ భాగవతాలు చదువుతావట."

ఈ వరసన ఆవిడ మాట్లాడుతోంటే సునీత కళ్ళప్పజెప్పి కూర్చుంది. "ఎందుకిన్ని అబద్ధాలు?" అని లోలోపల గుబగుబలాడింది.

అక్కడితో ఆగలేదు వెంకటమ్మగారు -

"మా వాడున్నాడు చూశావ్? ఈ కాలపు మనిషి కాడు - పిల్లను చూసుకోడానికి రమ్మని ఎంత అడిగాననుకున్నావ్? నువ్వు చూస్తే చాలమ్మా! నేను చూడక్కర్లేదు అన్నాడు - నేనంటే

అంత గురి వాడికి. " ఆగి ఒక్కసారి గర్వంగా నవ్వి మళ్ళీ అంది వెంకటమ్మగారు "ఇదుగో అమ్మాయ్! ఒకవేళ నువ్వు మావాడిని చూడాలనుకుంటే చెప్పు - పిలిపిస్తాను - "

"ఎందుకులెండి! మీ అబ్బాయిలాగే పెద్దలమాట నేనూ కాదనలేను-" చిన్నగా నవ్వుతూ సమాధానం చెప్పింది సునీత.

"నా తల్లీ?" మురిసిపోయింది వెంకటమ్మ.

"ఏడాది తిరిగేలోగా నాకు గుమ్మడిపండులాంటి మనవణ్ని యివ్వాలి సుమా!" హెచ్చరించింది.

సునీత మనసు ఎలాగో అయిపోయింది - మాట్లాడలేకపోయింది. అదంతా సిగ్గు అనుకుని మరింత మురిసిపోయింది వెంకటమ్మ.

సునీతా మాధవ్‌లకు మహా వైభవంగా పెళ్ళి జరిగింది. మూడు నెలల కాలం ముచ్చటగా జరిగింది. ఆ తరువాత వెంకటమ్మ నస ప్రారంభమయింది.

ప్రతినెలా "ఏమైనా విశేషమా?" అని కోడలినడగటమూ, సునీత ఏమీలేదనగానే ముఖం మాడ్చుకోవటమూ. ఇదంతా మాధవ్‌కు చెప్పింది సునీత.

మాధవ్ తేలిగ్గా కొట్టిపారేస్తూ "ఏదో చాదస్తం- పోనిస్తూ -" అన్నాడు.

ఆ రోజు ఇంట్లో భారీ ఎత్తున పూజలు ప్రారంభించింది వెంకటమ్మ.

"ఎందుకీ పూజలు?" అంది సునీత.

"ఎందుకేమిటి? నీ కడుపున ఒక కాయ కాయటానికి" విసుక్కుంటూ అంది వెంకటమ్మ.

బిక్కచచ్చిపోయింది సునీత. చేసేదిలేక వెంకటమ్మ చెయ్యమన్నవన్నీ చేసింది... చివర పురోహితుడి చేత కంకణం కూడా కట్టించుకుంది.

బెడ్‌రూంలో ఆ కంకణం విప్పి దూరంగా పారేస్తూ "ఈ కంకణంలో నిజంగా మహత్యం ఉండి పిల్లలు పుడతారేమో! మళ్ళీ కట్టుకోకు -" పకపకా నవ్వాడు మాధవ్. రోషంగా తల తిప్పుకుంది సునీత.

"పిల్లికి చెలగాటం. . . ఎలక్కి ప్రాణసంకటం " అంది కన్నీళ్ళతో.

మాధవ్ జాలిపడి ఆ కన్నీళ్ళు తుడుస్తూ "ఇంతమాత్రానికేనా? ఆ మాత్రం భరించలేకపోతే ఎలా?" అన్నాడు ప్రేమగా.

ఆ అనునయంలో తన చిరాకంతా మరిచిపోయింది సునీత.

ఇంక ఆ రోజునుంచీ తాయెత్తులూ, మంత్రాలు, విభూతులూ ఒకదాని వెంట ఒకటి కురవసాగాయి సునీతమీద. చచ్చినట్లు అన్నీ భరించింది.

వెంకటమ్మకు సహనం నశించింది - తనకు మనవడు రాకపోవటానికి కారణం సునీతే అయినట్లు ఏదో వంకన సునీతను సతాయించసాగింది.

ఆ రోజు తనింటికొచ్చిన లేడీ డాక్టర్‌ని చూసి ఆశ్చర్యపోయింది సునీత.

"ఎవరికి జబ్బు? డాక్టరెందుకు?" అంది -

వెంకటమ్మ మూతి, ముక్కు విరుస్తూ "ఇంకెవరికీ? నీకే! నీ కోసమే తీసుకొచ్చాను- " అంది.

సంగతి అర్థం చేసుకుంది సునీత.

తనను పరీక్ష చెయ్యటానికి వచ్చిన లేడీ డాక్టర్‌తో రహస్యంగా చెప్పేసింది "మా వారికి పిల్లలక్కర్లేదు - ఈవిడకి వెంటనే కావలి - మధ్యలో నేను ఛస్తున్నాను- "

లేడీ డాక్టర్ ఓదార్పుగా "ఇంతేనా? మీ వారి ఆలోచనే మంచిది. ఇప్పటి నుండీ పిల్లలెందుకు? రెండు మూడేళ్ళయ్యాక చూసుకోవచ్చు - మీ అత్తగారితో ఎలాగో సర్దుకుపో!" అంది.

వెంకటమ్మతో "మీ కోడలికి జబ్బేమీ లేదు - మీరు అనవసరంగా కంగారు పడకండి- " అనేసి వెళ్ళిపోయింది.

ఈ వార్త వెంకటమ్మకి రుచించలేదు - అప్పటివరకూ ఆవిడ తన కోడలికి ఏదైనా జబ్బు కాకూడదా అని ఆశపడుతూ వచ్చింది - మందులేవో ఇప్పిస్తే ఆ జబ్బు నయమయిపోయి తనకు మనవడు పుడ్తాడని ఆశపడుతోంది - లేడీ డాక్టర్ మాటలతో ఆవిడ ఆశలన్నీ నీరు కారిపోయాయి.

ఆ ఆశాభంగమంతా సునీతమీద కసిగా మారింది - రోజు ఏదో ఒక వంకన "గొడ్రాలు" అని సునీతను నిందించకుండా ఉండదు - ఆ మాట విన్నప్పుడల్లా సునీతకు ఒళ్ళంతా కారం రాసినట్లు అనిపించేది. రోజురోజుకూ పిల్లలు పుట్టడానికి సలహాలు చెప్పేవాళ్ళూ, చిట్కా వైద్యాలు చెప్పేవాళ్ళూ ఎక్కువైపోయారు. ఎవరో బైరాగి మంత్రం వేస్తాడనీ. మరెవరో 'అమ్మ' విభూతి ఇస్తుందని కూడా కబుర్లు రాసాగాయి.

పిల్లిమీద పెట్టీ, ఎలుకమీద పెట్టీ రోజుకొకసారైనా "పిల్లలులేని ఆడదాని బ్రతుకూ ఒక బ్రతుకేనా?" అనకుండా ఉండదు వెంకటమ్మ.

రోజురోజుకీ ఈ పరిస్థితి దుర్భరమయిపోయింది సునీతకు. ఇంక భరించలేకపోయింది.

మనవడిమీద ఆశలన్నీ వదిలేసుకున్న వెంకటమ్మ సునీత వాంతి చేసుకుంటుంటే విసుక్కుంటూ "ఏ అడ్డమైన గడ్డి తిన్నదో? డాక్టర్‌కి చూపించుకో!" అంది.

"అదికాదత్తయ్యా! మీకు బుల్లి మనవడు రాబోతున్నాడు -" సగర్వంగా చెప్పింది సునీత.

వెంకటమ్మ ఆనందానికి అంతులేదు - సత్యన్నారాయణ వ్రతం చేసింది - వెంకటేశ్వరస్వామికి కొబ్బరికాయలు కొట్టింది. రాముణ్నీ కృష్ణుణ్నీ పూజించింది - చివరకు ఆంజనేయ దండకం కూడా చదివేసింది.

మాధవ్ మాత్రం ముఖం చిట్లించుకున్నాడు - "ఏమిటి నీ ఉద్దేశం? నేను ఇంత చెప్పినా. . ." అన్నాడు రుసరుసలాడుతూ.

"క్షమించండి! మీ మాట కాదనాలని నాకు లేదు - నాకు మాత్రం ఒకటి రెండేళ్ళు చంటీ వెంటీ లేకుండా సుఖపడాలని లేదా? కానీ ఈ అమ్మలక్కల బాధ పడలేక."

"బాగుంది! వాళ్ళందరికి చెప్పవలసినది పోయి, నువ్వే "

"నన్నే మైనా అనబోయేముందు మీరొక్కసారి ఆత్మ పరీక్ష చేసుకోండి. మీ అమ్మగారికి మీరెంతవరకు నచ్చజెప్పగలిగారు? ఏవేవో అబద్దాలతో మాయమాటలతో దాటుకుపోవాలని చూసారు కాని మీ మార్గానికి ఆవిడను రప్పించగలిగారా? మన పెద్దవాళ్ళు కూడా మన పరిస్థితిని అర్థం చేసుకుని మనతో సహకరించేవరకూ మనం ఆశించే ఆ శుభోదయం సుదూరంలోనే ఉంటుంది. నేను చెప్పగలిగినదల్లా మీ ఇద్దరిమధ్యా సమన్వయాన్ని సాధించటం ఇప్పుడు మీ అమ్మగారికోసం ఒక బాబు. ఆ తరువాత మీ కోసం. . . సారీ. మనకోసం. అయిదేళ్ళవరకు బంద్."

మాధవ్ వంక చూసి మనోహరంగా నవ్వింది సునీత - ఆ చిరునవ్వుకు కరిగిపోయాడు మాధవ్.

సునీత వాదనలో నిజానికి తలవంచాడు. . . అవును పాపం! సునీతకాని మరొకరు కాని ఏం చెయ్యగలరు? వెయ్యి కాకుల మధ్య హంసకేం రాణింపు? గులకరాళ్ళ గుట్టలో రత్నానికేం గుర్తింపు? ఈ కుటుంబ నియంత్రణ ఆవశ్యకాన్ని అందరూ గుర్తిస్తే తప్ప మనం ఆశించే ఆ శుభోదయం సుదూరంలో ఉండక తప్పదు.

విలువలు

-సి.ఆనందారామం

"ప్రతి రంగంలోనూ హైక్లాస్, మిడిల్ క్లాస్, లో క్లాస్ అని ఉంటాయి. ఏ రంగంలోనైనా హైక్లాస్ దొంగని పట్టగలిగే పోలీసు లేడు! హైక్లాస్‌లో ఏది చేసినా గౌరవంగానే ఉంటుంది.... చివరకు వ్యభిచారం కూడా....."

నాగావళి ఆనందానికి అంతులేదు. యించుమించు నాలుగేళ్ళ తరువాత సరోజను కలుసుకోబోతుంది.

సరోజ తన చిన్ననాటి స్నేహితురాలు. ఇప్పుడెలా వుందో? ఆనాడు తన నిస్సహాయస్థితిలో ఉన్నప్పుడు తననెంతగా ఆదుకుంది? ఎవరైనా ఎంత చేశారు అన్నది ప్రధానం కాదు. ఎలాంటి హృదయంతో చేశారన్నది ప్రధానం....

అప్పట్లో తనకు ఉద్యోగం లేదు. బి.ఏ.డిగ్రీ పొంది దానితో ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు ఒక్కటీ ఫలించలేదు.

చిన్నప్పటినుండీ తను దురదృష్టవంతురాలే! పుడుతూనే తల్లిని కోల్పోయింది. తండ్రి పదేళ్ళవరకు చక్కగానే పెంచాడు. ఆ తరువాత ఆయన పోయాడు. బాబాయి, పిన్నీ తనను పెట్టిన ఆరిళ్ళు ఇన్నీ అన్నీ కావు. న్యాయానికి వాళ్ళను అనవలసిన పని కూడా లేదేమో! ఈ కరువు రోజుల్లో ఒక మనిషికి మరో మనిషి బరువైతే భరించటం కొంచెం కష్టమే మరి!

ఆ రోజుల్లో తనకు వూపిరిపోసింది కూడా సరోజ స్నేహమే! సరోజ మాత్రం మహా భాగ్యవంతురాలా అంటే అదేమీ కాదు. వాళ్ళదీ మధ్య తరగతి కుటుంబమే! అయినా వాళ్ళ అమ్మను బ్రతిమాలి, బ్రతిమాలి తనకు కూడా ఫలహారాలు పెట్టేది, సాధ్యమయినంత వరకూ భోజనం వాళ్ళింట్లోనే గడిచిపోయేలా చూసేది. ఏదో వంకపెట్టి తన చీరల్లో కొన్ని ఇచ్చేసేది.

ఏనాటికయినా సరోజ రుణం తీర్చుకోగలనా అనిపించేది ఆ రోజుల్లో. అలా అతి కష్టం మీద బి.ఏ. పాసయింది.

ఆ రోజుల్లోనే సరోజకు పెళ్ళయింది. కన్నీళ్ళతో యిద్దరూ విడిపోయారు. బి.ఏ. పాసవగానే కష్టాలన్నీ గట్టెక్కుతాయని కన్న కలలన్నీ కల్లలయిపోయాయి. ఎంతో ప్రయత్నించింది ఉద్యోగం కోసం! ఇంట్లో పిన్ని సతాయింపులెక్కువయిపోయాయి. కంచంలో అన్నం పెట్టి తిట్టే ఆ తిట్లు... ఆ తిండి ఎలా తినగలిగిందో ఎలా బ్రతకగలిగిందో.... అంతలో కంచే చేనుమేసినట్లు.... బాబాయే.... చివ్వున నీళ్ళు చిమ్మాయి. నాగావళి కళ్ళలో....కళ్ళు తుడుచుకుని కసిగా నవ్వుకుంది.

పోనీలే! అంతా మంచికే జరిగిందేమో... ఇప్పుడు తనకేం తక్కువయిందని. దర్జాగా బ్రతుకుతోంది. ఆనాడు ఏ గుమాస్తా ఉద్యోగమో దొరికి ఉంటే ఏ కుర్చీలో బ్రతుకు అంకితమయ్యేదేమో! జరగని విషయాలు తలుచుకునీ బాధపడేకంటే జరిగిన దానిలో మంచిని ఎంచుకోవటం మేలుకదూ! అవును! తను అదృష్టవంతురాలే! విలాసంగా నవ్వుకుంది నాగావళి.

సరోజ కోసం ఎర్ర పట్టుచీర కొంది. దానిమీదికి కెంపుల దుద్దులూ ఎర్రరాళ్ళ నెక్లెసూ కూడా తీసుకుంది. సరోజకు ఇద్దరు పిల్లలు ఉన్నారని వింది. వాళ్ళకుకూడా బట్టలు కొంది. ఇంకా స్వీట్స్, పళ్ళూ అన్నీ కొని కారులో సరోజ ఎడ్రస్ వెతుక్కుంటూ బయలుదేరింది.

తలుపు తీసిన వ్యక్తిని "సరోజగారున్నారా?" అని అడిగింది.

ఆ వ్యక్తి నాగావళిని విస్తుపోయి చూస్తూ "నువ్వు నాగావళివి కదూ!" అంది.

ఆ కంఠం విని నాగావళికి మతిపోయినట్లే అయింది.

"సరోజా..." అంటూ కౌగిలించుకుంది.

ఆవేదనతో కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "ఏమిటిది ఎందుకిలా అయిపోయావ్‌రా? నా మనసులో ఎప్పుడూ ప్రతిధ్వనించే ఆ కంఠం ఒక్కటి అలాగే ఉండబట్టి గుర్తుపట్టగలిగాను. బొత్తిగా రూపు మారిపోయావు - ఆరోగ్యం బాగుందా?...."

నాగావళి పొందుతోన్న ఉద్వేగంలో సగం కూడా సరోజకు కలగలేదు. తనను చుట్టివున్న నాగావళి చేతులను ఒకరకం విసుగుదలతో విడిపించుకొంది.

"ఎందుకొచ్చావ్?"

ఇంకా కన్నీళ్ళు కారుస్తున్న నాగావళి కళ్ళు ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి. కొయ్యబొమ్మలా నిలబడిపోయింది. ఆ చూపులు కాని, వాటిలో ఉన్న దైన్యంకాని సరోజను కొంచెం కూడా కదిలించలేకపోయాయి.

"ఎందుకొచ్చావ్?" మళ్ళీ అంది. కూర్చోమనైనా అనకుండా.... నాగావళికి అర్థమయిపోయింది. నీరసంతో తనే ఒక కుర్చీలో కూలబడింది.

"సరూ! నువ్వూ నన్ను నలుగురిలాగే అనుకుంటున్నావా?"

"నేను నలుగురిలో బ్రతుకుతున్నదాన్ని. నలుగురిలతో వేలెత్తి చూపించుకోకుండా బ్రతకాలనుకుంటున్నదాన్ని....."

నాగావళి ఆడనాగులాగే బుసలుకొడుతూ లేచింది.

సరోజ ముఖం చూస్తూ తీక్షణంగా ఏదో అనబోయి గతస్మృతులు కనులముందు కదలాడగా కరిగిపోయి "సరూ! ఏం జరిగిందో తెలుసుకోవాలని లేదా నీకు?" అంది.

"ఏదో జరుగుతుంది. ఎలాగో అవుతుంది. అవన్నీ తెలుసుకొని మాత్రం నేనేం చేయగలను? సామాన్య సంసారిని...."

ఇంక మాట్లాడదలచుకోలేదు నాగావళి....

తను తెచ్చిన చీర, నగలు - పిల్లలకి బట్టలు అవన్నీ పైన పెట్టింది.

"ఇంక వెళుతున్నాను -" అంటూ లేచింది.

"అవికూడా తీసికెళ్ళు...."

"ఏం? నా చేత్తో ముట్టుకుంటే వీటికి కూడా పాపం అంటుకుంటుందా?"

"అది కాదు నిన్ను ఆదరించగలిగే సాహసం నాకు లేనప్పుడు ఈ బహుమతులు తీసుకునే అర్హత కూడా లేదు."

నాగావళి మౌనంగా తను తెచ్చిన సామానులన్నీ తనే తీసుకుని కారులో కూర్చుంది. కారు కదలగానే ఒక్కసారి వెనక్కు తిరిగింది. అంతవరకూ గుమ్మంలో నిలబడ్డ సరోజ లోపలకు తప్పుకుంది. తలుపులు మూసుకున్నాయి.

నాగావళి మనుష్యులందరిమీద కసితో భగ్గుమంది.

ఆనాడు పిన్ని ఆప్యాయంగా తలంటినప్పుడు, కొత్త చీర కట్టుకోమన్నప్పుడూ, కంచే చేను మెయ్యబోతున్నదని ఊహించలేకపోయింది. బాబాయ్ బాస్ గదిలోకి తనను పంపిస్తున్నప్పుడు సంగతి అర్థమయిపోయింది. ఒక్క సంగతి కాదు! చాలా సంగతులు అర్థమయిపోయాయి. బాబాయి స్వార్థానికి తనను బలిపశువుగా వాడుకోబోతున్నాడు. తప్పించుకునేందుకు ఏవిధమయిన మార్గమూ లేదు. తప్పించుకుని చెయ్యగలిగినదీ లేదు.

చిరునవ్వుతో సమీపించిన తనను చూసి అతడు ఆశ్చర్యపోయాడు. అతడి పేరు గుర్తులేదు అయినా పేర్లతో, వ్యక్తులతో తనకు నిమిత్తమేమిటి?

"నువ్వు బెదిరిపోతావనీ, గోల చేస్తావనీ చెప్పాడు మీ బాబాయి...." అన్నాడు వెకిలి నవ్వుతో.... అందుకు తను సంసిద్ధంగా ఉన్నట్టు.

"అవును! ఈ గదిలో అడుగుపెట్టేవరకూ బెదిరిపోతూనే ఉన్నాను - ఎలా తప్పించుకోవాలా అని శతవిధాలా ప్రయత్నిస్తున్నాను. కానీ..... మిమ్మల్ని చూశాక ఇప్పుడు.... తప్పించుకోవాలని లేదు! ఇదీ అదృష్టమేననిపిస్తోంది...." వందమంది బడిపంతుళ్ళకంటే బ్రతుకు భలే పాఠాలు నేర్పిస్తుంది.

పొంగిపోయాడా సరసుడు. తనను తాను మరోసారి అద్దంలో చూసుకున్నాడు. సగర్వంగా నవ్వుకున్నాడు.

"మీరు మా బాబాయికెంత యిస్తానన్నారు?" చిరునవ్వుతోనే గోముగా అడిగింది.

"వెయ్యి రూపాయలు యిస్తానన్నాను" దర్జాగా అన్నాడు ఆ సరసుడు.

"అబ్బా! ఎందుకండీ అంత ఇవ్వటం? అసలేమీ ఇవ్వద్దు...."

"ఎలా? ఇస్తానన్నానే!"

"ఇంకా నయం! ముందుగానే ఇచ్చారు కాదు. నా మాట వినండి ఏమీ ఇవ్వకండి...."

నాగావళి అతని మెడచుట్టూ చేతులు పెనవేసి గిలిగింతలు పెడుతూ ముద్దు పెట్టుకుంది, నిలివెల్లా పులకించిపోయాడా పురుష పుంగవుడు.

విధి తన జీవిత విధానాన్ని ఇలా నిర్ణయిస్తే..... కానియ్యి.... ఇందులోనే తను రాణించాలి!

"నన్ను మీతో తీసుకుపోండి....." గారాబంగా అంది నాగావళి.

అంతులేని ప్రేమ ప్రవాహంలో మునకలు వేస్తోన్న ఆ మహానుభావుడు ఉలిక్కిపడ్డాడు. లోలోపల విరగబడి నవ్వుకుంది నాగావళి.

"నేను మీతో ఉండనులెండి! నన్ను వేరే ఎక్కడైనా దించండి. నా బ్రతుకు నేను చూసుకోగలను. ఇక్కడినుండి తప్పించండి...."

"మరి మీ బాబాయి...."

"భలేవారండీ. మా బాబాయి ఏం చెయ్యగలడు మిమ్మల్ని!"

"ఆల్‌రైట్"

అలా నాగావళి జీవిత మార్గం నాగావళి ఎన్నడూ అనుకోని విచిత్రమైన మలుపు తిరిగింది.

ప్రతి రంగంలోనూ హైక్లాస్, మిడిల్‌క్లాస్, లోక్లాస్ అని ఉంటాయి. ఏ రంగంలోనయినా హైక్లాస్ వాళ్ళనేమీ చెయ్యలేరు. దొంగల్ని పట్టగలిగే పోలీస్ లేడు!

హైక్లాస్‌లో ఏం చేసినా అందంగానే ఉంటుంది. చివరకు వ్యభిచారం కూడా. నాగావళి సంవత్సరానిక కొకరికి భార్యగా ఉంటుంది. ఆ సోకాల్డ్ భర్తగారి దగ్గిర మెలేసి నెలకు రెండువేలు తక్కువకాకుండా వసూలు చేస్తుంది. ఎప్పటికప్పుడే ఆవిడ మహా పతివ్రత. ఆవిడభర్తల్లో ఎవరినడిగినా ఆ విషయం ఒప్పుకుంటారు. ఇప్పుడు నాగావళి బోలెడు డబ్బు కూడబెట్టింది. సంఘంలో పరువుప్రతిష్టలకు కూడా తక్కువలేదు. ఆ మధ్య ఏదో సాహిత్య సమావేశానికి అధ్యక్షత కూడా వహించింది. రెండు మహిళా సంఘాలకు సెక్రటరీ - మూడు అనాథ శరణాలయాలకు ఎడ్‌వైజర్.... అయిదు సాహితీ సంఘాలకు అధ్యక్షురాలు.

నాగావళి జీవితం అలా నవనవోన్మేషంగా మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగిపోతోంది. పిల్లలు పుడితే అందం చెడిపోతుందని ఆవిడ పిల్లల్ని కనలేదు. అయితే పిల్లలు లేని కొరత ఆవిడకు లేదు. ఒక పిల్లాణ్ని పెంచుకుంటుంది. వాడికి ఆవిడంటే పంచప్రాణాలూ! ఈ రోజుల్లో చిన్న పిల్లలకు కూడా డబ్బు విలువ తెలుసు...

ఆ రోజు మహిళా మండలి సభ్యురాలు మిసెస్ శోభాదేవి చెప్పిన కథ చాలా ఆసక్తి కలిగించింది నాగావళికి.

"పాపం, ఆవిడ ఎవరో పెద్దింటి మనిషిలాగే ఉంది. పెళ్ళయింది ముగ్గురో నలుగురో పిల్లలు కూడాను.... ఆ మొగుడికేం రోగమో.... ఇప్పుడు మరొకదాన్ని తెచ్చుకున్నాడు....

బాధపడింది. దెబ్బలాడింది... ఏమీ ప్రయోజనం లేకపోగా చచ్చినట్లు నోరు మూసుకు పడి ఉంది బయటపడలేక! అక్కడితో ఆగలేదు ఈ కథ - ఆ మహా ఇల్లాలికి అసలైన ఇల్లాలి స్థానం ఆక్రమించాలని ఆశ కలిగింది. అంచేత పాపం ఈవిణ్ని వెళ్ళగొట్టాలని ప్రయత్నించింది, ఈవిడ భారతనారీ శిరోమణి కదండీ!... అందుకని ఆ భర్తగారి పాదపద్మాలు వదలనని మొండికేసి కూర్చుంది! అప్పుడా పతిదేవులు ఈవిడ పాతివ్రత్యాన్ని మరింత పరీక్షించాలని ఉభయ సంధ్యల్లోనూ మరిచిపోకుండా చావతన్నటం మొదలుపెట్టాడు. అప్పటికీ ఈవిడ చలించలేదు. ఆ అఖండమైన పాతివ్రత్య గరిమకు ముగ్ధుడైన పతిదేవుడు ఆవిడకు 'కులట' బిరుదునిచ్చి.... ఆ బిరుదుకు తగిన ఘనసన్మానాలతో పుట్టింటికి సాగనంపాడు.....

మనుష్యులకి.....ముఖ్యంగా మన తెలుగువాళ్ళకి స్కాండల్స్ అంటే ఉన్నంత ముచ్చట ఇంతా అంతా కాదు. మనోళ్ల గురించి నలుసును కొడంత చేసి చెప్పుకుంటే మన గొప్పతనం మనకే మరికాస్త గొప్పగా అనిపిస్తుంది మరి! అంచేత ఆవిడ ఎటు కదిలినా పదికళ్ళు వింతగా చూసేవి. పెదవులపై నాలుకలు వెక్కిరింతగా బయటకు సాగేవి... తల్లీదండ్రీ ఆదరించినా, వదినలకు మరదళ్ళకూ తమ ఆడబిడ్డ మీద ఆధిపత్యం సంపాదించడానికీ సతాయించడానికీ ఇదొక మంచి ఆయుధం దొరికింది.

చివరకు ఆవిడ పుట్టింట్లోనూ ఉండలేకపోయింది.... బి.ఏ. చదువుతుండగా పెళ్ళవటంవల్ల చదువు మానేసిందట! ఆ డిగ్రీ కూడా రాలేదు. నాకేదో దూరపు బంధువులెండి! ఏదైనా ఉద్యోగం చూపించమని వచ్చింది...."

కదంతా విని నిట్టూర్చింది నాగావళి...."సరే! తీసుకురండి! చూద్దాం!" అంది.

తనకు సాధ్యమయినంతవరకు మరొకళ్లకు ఉపకారం చెయ్యటానికి నాగావళికి ఎలాంటి అభ్యంతరమూ లేదు.

ఆ మరునాడు శోభాదేవితోకూడా తన దగ్గరకు వచ్చిన వ్యక్తిని చూసి నివ్వెరపోయింది నాగావళి.

"సరో...." అని ఆగిపోయింది - సరోజ ముఖంలోనూ రంగులు మారిపోయాయి. గిర్రున వెనక్కి తిరిగింది....

"వెళ్ళిపోతున్నారేం? ఉద్యోగం అక్కర్లేదా?" శాంతంగా అడిగింది నాగావళి.

సరోజ ఆగి నాగావళి వైపు తిరిగింది. నాగావళి కంఠం ఎంత శాంతంగా ఉందో కళ్ళలో అంత హేళన ఉంది....

సరోజ ధైర్యంగా సమాధానం చెప్పింది....

"అవును! కావాలి!"

"మేం ఇచ్చిన ఉద్యోగం చేస్తారా?"

"ఉద్యోగం ఎవరు ఇచ్చినదయితేనేం? సవ్యమయినదయితే చాలు!"

"ఓహ్! ఇంతవరకూ మీరు అంతా సవ్యంగానే బ్రతికారన్నమాట!"

"జీవితం మన చేతుల్లో లేదు. సాధ్యమయినంతవరకూ ఒక మార్గంలో నిలబడాలని ప్రయత్నించాను!"

"సరోజా! నన్ను గుర్తుపట్టావా!"

"ఎప్పుడు మరిచిపోయానని?"

"ఓహ్! ఇప్పుడు ప్రేమలన్నీ పొంగుకొస్తున్నాయి కాబోలు!"

"నిన్ను నమ్మించాలని నేను ప్రయత్నించలేను!"

"ప్రయత్నాలెందుకు? ఆ రోజు గుమ్మంలోనుంచి వెళ్ళగొట్టడం చాలదా?"

"ఆ రోజు కాదు! ఈ రోజైనా ఆ గుమ్మంలోకి నువ్వొస్తే అంతే చేస్తాను!"

"ఎందుకో!"

"ఈ ప్రశ్నకు ఒకప్పుడయితే సమాధానం చెప్పలేకపోయేదాన్ని కానీ ఇప్పుడు నా బ్రతుకు బజారునపడింది గనుక అభిమానమనేది నాకేమీ మిగలలేదు గనుక చెపుతున్నాను. ఆనాడు నువ్వు అడుగుపెట్టిన ఇంట్లో నాకెలాంటి స్వతంత్ర్యమూ లేదు. చివరకు ఒక స్నేహితురాలికి ఆతిధ్యమిచ్చే స్వాతంత్ర్యంకూడా లేదు. నిన్ను గురించి వివరంగా ఆయనకు చెప్పుకోవాలి! ఆ అవహేళనలన్నీ భరించాలి! అది నా వల్ల కాలేదు".

"కానీ, చివరకు నేనిచ్చిన బహుమానాలు కూడా తిరస్కరించి....."

"ఆ నాడే చెప్పాను..... నిన్ను ఆదరించలేకపోయాక ఆ బహుమతులు తీసుకోలేనని...... నేనూ మనిషినే! వస్తాను!"

వెళ్ళబోయింది సరోజ.....

నాగావళి ఇంక నిగ్రహించుకోలేకపోయింది.

కన్నీళ్ళతో రోషంగా "వెళుతున్నావా? ఇంకా నన్ను శిక్షించాలనే అనుకుంటున్నావా?" అంది.

సరోజ కళ్ళలో నీళ్ళు తిరిగాయి....."ఆ రోజు నిన్ను గుమ్మంలోంచే వెళ్ళగొట్టినందుకు నాకు నేను విధించుకుంటున్న శిక్ష. నిజం చెప్తున్నాను ఆనాడు నీమీద నాకు తేలికభావం లేదు - ఈనాడు అసలు లేదు. జీవితంలో నేను సాధించినదేమిటి? పొందినదేమిటి? ఏనాడూ చల్లనిమాటకు నోచుకోలేదు. అనురాగం, ఆప్యాయత ఎలా ఉంటాయో కథల్లో చదవటమే తప్ప అనుభవంలోకి రాలేదు. ఇక పరువు ప్రతిష్టలు. . ."

సరోజ ఆగి పకపక నవ్వి అంది - "ఈ నాడు సంఘంలో నీకున్న పరువులో సగం కూడా నాకు లేదు....."

వినయం వివేక లక్షణమ్

శ్రీమద్రామాయణం లోని కథ

పరమాత్ముడైన శ్రీ రామ చంద్రుడు అమిత పరాక్రమశాలి మహావీరుడు ధనుర్విద్యానిపుణుడు. శ్రీ రాముడు బ్రహ్మర్షి అగు వసిష్ఠ మహర్షి వద్ద సకల శాస్త్రములు ధనుర్విద్య అభ్యసించినాడు. గాయత్రీ మంత్రద్రష్ట అగు విశ్వామిత్ర బ్రహ్మర్షి వద్ద బల అతిబలాది విద్యలు మఱియు ఎన్నెన్నో అతి రహస్యములైన అస్త్రములను నేర్చినాడు. ఈ అస్త్రములు కేవలము విశ్వామిత్రులవారికే తెలియును. ఇదియే కాక పరమపూజనీయుడగు అగస్త్య మహర్షి శ్రీ రామ చంద్రునకు దివ్య ధనువు అక్షయ తూణీరము రత్నఖచిత ఖడ్గమును ప్రసాదించెను.

౧. ఒక్క బాణముతో శ్రీ రామ చంద్ర మూర్తి మహాబలశాలియైన తాటకను నేలకూల్చెను
౨. ఒకేమాఱు రెండు బాణములు వదిలి సుబాహు సంహారము చేసి మారీచుని సప్తసముద్రాలకు అవతల పారవేశను
౩. మహాభారవంతమైన శివచాపమును అవలీలగా ఎత్తి ఎక్కుపెట్టిన అది విరిగెను
౪. శ్రీ రాముడొక్కడే ప్రహరార్ధకాలములో (౯౦ మిన్.) ఖర త్రిశిర దూషణాదులను వారి సేనలను సంహరించెను

ఇంత ప్రతాపవంతుడైనప్పటికీ శ్రీ రాముడు ఎప్పుడూ తనకుతానుగా బలప్రదర్శనము చేయలేదు. ఆ దయార్ద్ర హృదయుడు సర్వదా వినయవంతుడై వర్తించెను. దీనికి తార్కాణము సముద్రుని గర్వభంగ ఘట్టము.

శ్రీ రాముని సైన్యము సముద్ర లాంఘనము చేయుసమయము వచ్చెను. సర్వజ్ఞుడైన రాముడు ఉపాయము ఎఱిగియు సహజ వినయవంతుడగుటచే పరమభాగవతోత్తముడైన విభీషణుని సలహా అడిగెను. విభీషణుడు ఇట్లు పల్కెను "ఓ రఘునాయకా! మీ బాణమొక్కటే కోటి సముద్రములనైనను శుష్కింప చేయగలదు. ఐనను సముద్రునే ఉపాయమడుగ ఉత్తమమని నా యోచన".

రావణుడు తనను వివాహమాడమని హెచ్చరించి సీతమ్మవారికి నెల రోజుల గడువు ఇచ్చెను. భరతుడు పదునాలుగేండ్లపై ఒక్క నిమిషము కూడా శ్రీ రామునికి దూరంగా ఉండజాలక శ్రీ రాముడు ఆలస్యమైన పక్షంలో శరీరత్యాగం చేసెదనని ప్రతిజ్ఞబూనెను. ఈ రెండు కారణముల వలన శ్రీ రాముని వద్ద అప్పటికి పట్టుమని ౩౦ రోజులుకూడాలేవు. ఐనను రఘురాముడు తన బలప్రదర్శనము చేయక వినయముతో సాగరుని ప్రార్థింప నిశ్చయించెను.

శ్రీ రాముడు ఉదధిని సమీపించి సముద్రునకు శిరసా ప్రణమిల్లెను. పిదప తీరమున దర్భలు పరచి ఆ దర్భాసనం పైన కూర్చుని తదేక దృష్టితో సముద్రుని ప్రార్థించెను. ఇట్లు ౩ దివసములు సముద్రునికై ప్రార్థించినను ఆ సముద్రుడు రాడాయె. చివరకు శ్రీ రాముడు "ఈతనికి సామముగా చెప్పిన వినడాయె. ఇటువంటి వారికి దండోపాయయే సరియైనది" అని సముద్రునిపై అస్త్రం సంధించెను. శ్రీ హరి కోపమును భరింపగలవారెవ్వరు? వెంటనే సముద్రుడు ప్రత్యక్షమయ్యెను. అంత దయాళువైన శ్రీ రాముడు సముద్రుని క్షమించి తాను ఎక్కుపెట్టిన అమోఘ బాణము దేనిమీద ప్రయోగింపవలెనని అడిగెను. సముద్రుడు ఉత్తరాన దుష్టులైన కాలకేయ రాక్షసులు ఉన్నారని సూచించెను. అంతట శ్రీ రాముడు ఆ అస్త్రముతో ఆ రాక్షసుల సంహారముచేసి ఆ కాలకేయులుండే పర్వతం ఔషధాలకు నిలయమై ప్రజాహితం చేకూర్చునని ఆశీర్వదించెను.

పిల్లలూ! మనం ఈ కథలోని నీతులను మరొక్కమాఱు చూద్దామ్:

౧. శ్రీ రాముడు ఎంత బలశాలి ఐననూ సముద్రునిపై బలప్రదర్శనము చేయక వినయముతో ప్రార్థించెను. వినయం సజ్జనుని భూషణమ్.
౨. మనకు ఉపాయము తెలిసినను తోటివారిని గౌరవించి వారి సలహా తీసుకుని ధర్మసమ్మతమైన పని చేయుట ఉత్తమ పురుషుని లక్షణమ్. అందుకనే శ్రీ రాముడు విభీషణుని సలహా అడిగెను.
౩. దయాగుణం ఉత్తమగుణమ్. సముద్రుడు తనకు చేసిన అపకారమును మన్నించి శ్రీ రాముడు అతనిని కాచెను.
౪. సజ్జనులు అప్రయత్నంగానే లోకహితం చేస్తారు. వారు ఏది చేసినా అది లోకహితమే అవుతుంది. శ్రీ రాముడు సముద్రునిపై కినుకబూని అస్త్రం సంధించినా అది చివరకు కాలకేయులను సంహరించి లోకహితం చేసింది.

విశ్వగీతి

సి.ఆనందారామం

అలలై తేలి - ఆశలుగా అల్లుకుని..... అందరాని అందాలను మెరిపిస్తూ మురిపిస్తూ ప్రాణకోటిని పరుగులెత్తించే మధుర సుధా స్రవంతి....... మోహనమూర్తి మురళీ గాన రవళి....

ఆ స్వరాలకు సమ్మోహితులై నాద ఝురిలో కొట్టుకొని పోతున్నారు సామాన్య గోపికలు - ప్రణయ పారవశ్యాన తాము పెట్టిన పరుగులన్నీ లౌకిక పరిసరాలను దాటించలేకపోయాయని గుర్తించినపుడు తెల్లబోయారు - బేలగా తిరిగి వచ్చారు.

మురళీ కృష్ణునిలో విశ్వమోహనుని చూసింది రాధ - ఎంతటి సమ్మోహనమూ స్వస్వరూప జ్ఞానాన్ని తొలగించలేక పోయిందామెకు. అందుకే పరవశించినా పరుగులలో పాల్గోలేదు. అయితేనేం? ఆమె ప్రగాఢ పారవశ్యమే ఆమెను అన్నింటినుంచి తప్పించింది. దివ్య సౌందర్యంలో ఒక భాగంగా దీపింపచేసింది.

గొల్లున ఏడుపులు..... కేకలు.... తన ఆలోచనలలోంచి తెప్పరిల్లింది రాధ ఎవరినో స్ట్రెచర్ మీద మోసుకొస్తున్నారు. ఎవరిది? కరుణ్! అవును! కరుణ్! తలమీద పెద్ద గాయంతో వంటినిండా దెబ్బలతో..... చూడలేకపోయింది - ఇంతఘోరం! ఎలా జరిగింది?

"అబ్బా!"

వెనుకనుండి వినబడ్డ కంఠస్వరానికి అదిరిపడింది గిర్రున తిరిగింది - స్ట్రెచర్‌మీద ఉన్న కరుణ్‌ని చూస్తున్న శేఖర్ చూపులు రాధ చూపులతో కలుసుకున్నాయి. గిరుక్కున క్రిందకు వాలాయి.

శేఖర్ ముఖం చూడలేకపోతోంది రాధ - ఆ ముఖంలో ఆమెకు భయంకర పిశాచాల బీభత్సతాండవం కనిపిస్తోంది - కరాళ కాళిక వికటాట్టహాసం వినిపిస్తోంది.

"ఆ కరుణ్ అంతు తేలుస్తాను! ఏమనుకున్నాడు? ఎవరితో చెలగాటమాడుతున్నాడు? పీక నొక్కి మురిగ్గుంటలో పారేసినా అడిగేవాడులేడు"

ఇవే మాటలు.... సరిగ్గా ఇవే మాటలు శేఖర్ నోట వినిపించాయి రెండురోజుల క్రితం - అప్పుడింత దారుణాన్ని ఊహించలేకపోయింది. మానవ సహజమయిన ఈర్ష్య ఆ మాటలను పలికించిందని భ్రమపడింది - కానీ శేఖర్ రాక్షసుడయ్యాడని - కాగలడనీ అనుమానించలేకపోయింది.స

ఒక్కసారి రాధ ముఖంలోకి చూశాడు శేఖర్ - మరుక్షణం ఎదురింట్లో ఉన్నాడు. అందరినీ తీసుకుని లోపలికెళ్ళాడు. స్పృహ తప్పిన కరుణ్‌ని తన కారులో పడుకోబెట్టుకున్నాడు. కారుని హాస్పిటల్ వైపు నడిపించాడు.

చూస్తూ నిలబడ్డ రాధ శరీరం సెగలూ పొగలూ కక్కింది. శేఖర్ తనకు బాగా తెలుసు. వల్లమాలిన ఉద్రేకం - ఆ ఉద్రేకంలో ఎంత దారుణంగానైనా ప్రవర్తించగలడు. ఆ తరువాత

పశ్చాత్తాపపడతాడు. ఎలాంటి పరిహారమైనా చెల్లించటానికి సిద్దపడతాడు - కరుణ్ స్థితికి కారకుడు శేఖర్ కాకపోతే ఒక్కనాటికీ ఇలా కారులో హాస్పిటల్‌కి తీసికెళ్ళడు.

ఇంటిముందు స్కూటర్ ఆగింది, కర్నల్ స్వామి దిగాడు. ఉడికిపోతూ కన్నీళ్ళు కక్కుతూ నిలబడ్డ రాధను చూశాడు. "రాధా" అన్నాడు ఆప్యాయంగా.

"అన్నయ్యా!" అని స్వామి భుజాలమీద వాలిపోయి వెక్కి వెక్కి ఏడ్చేసింది రాధ.

"పాపం! కరుణ్‌ని ఎవరో....." గొంతుకేదో అడ్డుపడినట్లయింది రాధకి.

"ఊరుకో! ఊరుకో!"రాధ భుజం తడుతూ ఓదార్పుగా అన్నాడు స్వామి. అయినా రాధ ఊరుకోలేకపోయింది. తనొక సిగరెట్ కాల్చుకుంటూ రాధను యధేచ్ఛగా ఏడవనిచ్చాడు స్వామి - అలాంటి సమయంలో ఏడవటమే మంచిదేమో!

ఎప్పటికో తిరిగి వచ్చాడు శేఖర్. ఉస్సురంటూ కూలబడ్డాడు. అతని ముఖం చూడగానే అణుచుకుంటోన్న దు:ఖం ఒక్కసారిగా పొంగింది రాధలో.

చూసి భరించలేకపోయాడు శేఖర్ "రాధా! ఏడవకు!" అన్నాడు. ఆ కంఠంలో ఓదార్పు లేదు. కరుగ్గా ఉంది. రాధ తల ఎత్తలేదు - ఏడుపు మానలేదు.

"నీ కన్నీళ్ళు చూడలేను రాధా!" ఈ సారి శేఖర్ కంఠం దయనీయంగా ఉంది. ప్రాధేయపడుతున్నట్లు ఉంది. రాధ మనసు మెత్తబడబోయింది.

"అతనికోసం నీ కంట కన్నీరు కురిస్తే నేను సహించను - " అతి గంభీరంగా, ఏదో బెదిరిస్తున్నట్లుగా ఉంది అతని కంఠం.

మెత్తబడబోతూ రాధ మనసు బండబారింది. అహం పడగవిప్పింది.....చివ్వున లేచింది.స

"ఏమిటీ? నేను ఏడవాలో ఏడవకూడదో నిర్ణయించే అధికారం కూడా మీదేనా? నన్ను ఏడిపించే హక్కు మీ ఒక్కరిదేనన్నమాట!" అంది వెటకారంగా - కసిగా.

"మరే నేను నిన్ను ఏడిపిస్తున్నాను కదూ!" రోషంగా అడిగాడు శేఖర్.

"ఊహు! కాదు - ఏడిపించటం కాదు - నా మెడలో అప్పుడెప్పుడో తాళి కట్టినంత మాత్రాన ....నా బాబుకి తండ్రి అయినంత మాత్రాన...నన్ను కొనుక్కున్నట్లు.... నేను మీ బానిసయినట్లు ప్రవర్తించడం ఏడిపించటం కాదు, ఇక్కడ నిలబడకు.... అక్కడ కూచోకు..... ఇటు తల తిప్పకు అటు చూడకు ఇలా ఏడవకు అలా నవ్వకు..... అనడం ఏడిపించడం కాదు....."

ఉద్రేకంతో అంటూ ఆగిపోయి పకాలున నవ్వింది రాధ - అక్కసుగా అంది "అవును. ఏడిపించటం కాదు. ఏడిపించలేరు. శరీరాన్ని ఇనుపగొలుసులతో బంధించినా మనసును ముట్టుకోలేరు. దానిని శాసించలేరు. దాని మార్గాన అది యధేచ్ఛగా ఎగిరిపోతుంది. మీకు మిగిలేది యంత్రం.... కట్టె.... శవం...."

శేఖర్ ముఖం ఒక్క క్షణం పాలిపోయింది. మరుక్షణం జేవురించింది "అలాగేం? ఎగురుతుందే మనసు! ఎగరనీ! ఎగిరి ఎగిరి అదే నామరూపాలు లేకుండా పోతుంది. నాకు

మిగిలేది యంత్రమే అయినా పరవాలేదు - ఆ యంత్రాన్ని ఎలా నడిపించుకోవాలో నాకు తెలుసు."

భగ్గుమంది రాధకి....

"కాదు! నేను యంత్రాన్ని కాను - మీరు నన్ను ఆడించలేరు. నేను మనిషిని. నా మనసు చెప్పినట్లే వింటాను. మీరు నన్నేమీ చెయ్యలేరు."

పిచ్చిదానిలా వీధిన పడింది రాధ - హాస్పిటల్‌లో కరుణ్ మంచం దగ్గిర వాలింది.

కరుణ్‌కి కప్పుడప్పుడే స్పృహ వస్తోంది. అస్పష్టంగా "రాధా!" అని కలవరిస్తున్నాడు.

అక్కడ కరుణ్ బంధువులంతా.... లోకం దృష్టిలో అతనికి కావలసిన వాళ్ళందరూ ఉన్నారు. అయినా అతడు రాధను.... ఎవరి కారణంగా తనీదశకు రావలసి వచ్చిందో ఆ రాధను - కలవరిస్తున్నాడు.

అతని బెడ్ మీద అతని పక్కనే కూలబడిపోయింది రాధ, నిలబడగలిగే శక్తి తనకేమీ మిగలనట్లు.స

"నేను వచ్చేశాను కరుణ్!" అంది ఉత్సాహంగా కాదు - ఆనందంగా కాదు - మొండిగా.

కరుణ్ పూర్తిగా కళ్ళు తెరిచాడు. "రాధా" అన్నాడు పట్టరాని ఆశ్చర్యంతో.... "రాధా!" అన్నాడు మళ్ళీ అంతులేని భయంతో.

"అవును ! రాధను!" నవ్వింది కన్నీళ్ళ మధ్య, ఆ నవ్వు చూసిన కరుణ్ ముఖంలోకి జీవం వచ్చింది.

"నిన్నొక్కసారి.... చివరిసారి చూడకుండా చచ్చిపోతానేమోనని ఎంత అలమటించాననుకున్నావ్? ఎలాగైనా నువ్వొక్కసారి కనిపించాలని తెలిసిన దేవుళ్ళందరినీ ప్రర్థిస్తున్నాను. నిన్ను చూశాను. సంతోషంగా చచ్చిపోతాను."

రాధ పెదవులు వణికాయి. ఆపుకోలేని దు:ఖం పొంగి వస్తోంది. అంత దు:ఖాన్నీ వెనక్కు నెట్టి అల్లరిగా నవ్వింది.

"మరే పాపం! ఎంతాశ! ఒంటరిగా చచ్చిపోదామనుకున్నావా? ఈ లోకంలో నీతో కలిసి రాలేకపోయినా పై లోకాలకు నీతో కలిసి రావాలనే వచ్చాను. ఎప్పుడో మరి, ముహూర్తం, నువ్వే నిర్ణయించు!"

"అదిమాత్రం పాపం కాదా?"

"కాదు! అక్కడ శరీరాలుండవు. మనసులే! అంతా గాలి! ఒఠ్ఠి గాలి! ఏ బంధాలూ లేని గాలి!"

పకాలున నవ్వాడు కరుణ్ "లాభంలేదు! ఇలా మాట్లాడగలిగే నిన్ను వదిలి...నిన్ను చూడగలిగే నా శరీరాన్ని వదిలి.... గాలిగా ఎగిరిపోలేను. ధూళిలో కలిసినా ఇక్కడే ఉంటాను."

అన్నాడు.

"ఛీ! ఛీ!"

గిర్రున తల తిప్పింది రాధ అయోమయంగా చూస్తూ...

చీత్కారం చేసింది స్వర్ణ. ఆ ఛీత్కారం భూనభోంతరాలు నిండి విశ్వమంతా ప్రతిధ్వనించింది. ఆ తాకిడిని తప్పించుకోలేని రాధ పాతాళానికి కృంగిపోయింది.

"అక్కా! నా కంటిలో మెల్ల ఉంది ఆయన నా ఆస్తి కోసమే నన్ను చేసుకున్నారంటావా?" అంటే.

"ఛీ! కరుణ్‌ని నువ్వు మాత్రం అర్థం చేసుకోలేదా? మెల్ల ఉన్నంత మాత్రాన తేలిగ్గా చూస్తాడా నిన్ను? అసలు నువ్వంటే కరుణ్‌కి అంతులేని ప్రేమ"అని ధైర్యం చెప్పిన రాధ.

"నేనేమీ చదువుకోలేదు. ఆయనకు తగిన భార్యను కానేమో?" అని బెంగపడితే....

"భార్య కావడానికి కావలసింది చదువుకాదు. మనసునిండా ప్రేమ. అది నీకు పుష్కలంగా ఉంది. కరుణ్‌కి నీకంటే మంచి భార్య ఈ జన్మకు కాదుకదా కోటి జన్మలకు కూడా దొరకదు" అని ఆత్మ విశ్వాసం కలిగించిన రాధ.....

ఆ రాధ ఈ రాధేనా? విభ్రాంతితో చూసింది స్వర్ణ..... రాధ..... తన రాధ... తన నోముల పంట తన బాబుకు తల్లి ఈనాడు తన కళ్ళముందు.... మరొకరి పక్కమీద....

సంభవమా! రగిలే మనసుతో.... రక్తం కక్కే కళ్ళతో చూశాడు శేఖర్....

రాధా.... పాపం, రాధ....భర్తను, సంపదనూ, సంసారాన్నీ వొదిలి.... సంఘాన్నెదిరించి... సంఘర్షణలకు తట్టుకొని తనకోసం తన దగ్గరకు వచ్చేసిన రాధ....

ఆరాధన నిండిన చూపులతో అభిషేకించాడు కరుణ్.....

రాధ అలాగే కూచుంది. పాతాళంలోకి దిగిన తన తలను పైకెత్తలేదు. ఎవరినీ చూడలేదు. ఏదీ ఆలోచించలేదు. కట్లతో నిండిన కరుణ్ చెయ్యి గట్టిగా పట్టుకుని కదలకుండా కూచుంది.

సమయానికి వెంటనే హాస్పిటల్ చేర్చటం వల్ల.... సమర్థులైన వైద్యులతో వైద్యం చేయించటం వల్ల.... త్వరలోనే కోలుకున్నాడు కరుణ్. ఆ ఖర్చంతా శేఖర్ భరించాడని తెలిసింది.

రాధ మనసు చల్లబడలేదు. మరింత మండింది. ఏదో గిల్టీగా ఫీలయినపుడు కాని శేఖర్ ఇలా ప్రవర్తించడు. ప్రాణాలకు మోసం వచ్చేలా తన్నించి ఆ తరువాత వైద్యం చేయించటమా ఔదార్యం?

హాస్పిటల్‌కు వచ్చిన రాధ మళ్ళీ తన ఇంటికి వెళ్ళలేదు. శేఖర్ ఒకటి రెండుసార్లు వచ్చాడు. రాధ తల ఎత్తి చూడలేదు. కరుణ్‌కు నయమయ్యాక అతనితో అతని ఇంటికే

వచ్చింది. స్వర్ణ రెండేళ్లు నిండిన తన కూతురిని తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోయింది.

కర్నల్ స్వామి వచ్చాడు....

"రాధా! నువ్వు చేసినపని నాకు నచ్చలేదు!" సూటిగా అన్నాడు.

"నీకు నచ్చాలని నేను చెయ్యలేదు" నిర్లక్ష్యంగా అంది రాధ. తనను విమర్శించే వ్యక్తులతో నిర్లక్ష్యంగా మాట్లాడటం నేర్చుకొంటోంది రాధ.

"ఛ! ఛ! ఏది జరగకూడదని ఇంత చేసానో, చివరకు అదే జరిగింది!"

"ఏమిటి నువ్వు మాట్లాడేది?"

కసిగా పళ్ళు నూరాడు స్వామి.

"ఆ కరుణ్ గాడిని చావతన్నిస్తే మళ్ళీ నీ జోలికి రాడనుకున్నాను. కానీ....ఏడవండి! వినాశకాలే విపరీత బుద్ధి"

స్వామి మాటలు వినపడటం లేదు రాధకి. ఆవిడ తల తిరుగుతుంది. . . గూండాలతో కరుణ్‌ని తన్నించింది శేఖర్ కాదు! స్వామి! మరి శేఖర్ ఎందుకంత శ్రద్ధ తీసుకుని వైద్యం చేయించినట్లు? అంతటి ఉదారస్వభావం కాదే?

శేఖర్ వచ్చాడు. తనంతట తను భార్య మరొకడితో కాపురం చేస్తున్న ఇంటికి వచ్చాడు. అతని ముఖం బాగా వడిలిపోయి ఉంది. తలెత్తలేదు రాధ.

"ప్లీజ్ రాధా! రెండునిముషాలు! మళ్ళీ నిన్ను డిస్టర్బ్ చెయ్యను."

బెదిరిపోతున్న చూపులతో చూసింది రాధ. . .

"జరిగినదానికి చాలా విచారిస్తున్నాను. ఎలా జరిగిందో నాకు అర్థం కావటంలేదు. కానీ భయంకరమయిన కోరిక అనుకోకుండా కార్యరూపం దాల్చింది. ఈర్ష్య అణుచుకోలేక కరుణ్‌ని చావతన్నాలని నాలో నేను ఎన్ని సార్లో అనుకున్నాను. వంటినిండా గాయాలతో హృదయవిదారకంగా మూలుగుతూ మంచాన పడిన అతణ్ణి ఊహించుకుని కసిగా నవ్వుకున్నాను. కానీ తీరా అతణ్ని అలా చూడగానే ఎందుకో వణికిపోయాను.... నేను అంత గాఢంగా కోరుకోవటమే అలా జరగటానికి కారణమేమో అనిపించింది. అందుకే వైద్యం చేయించాను. త్యాగ బుద్ధితోకాదు. అంత ఔదార్యం నాకు లేదు, ఇప్పటికీ అతనంటే నాకు ఈర్ష్య అంతులేని ఈర్ష్య" ఆగాడు శేఖర్, కరుణ్‌ని తలచుకోగానే కలిగిన ఉద్రేకం నిగ్రహించుకోవటానికి.

ఏమీ మాట్లాడలేదు రాధ. శిలలా కూచుంది.

"ఇదిగో ఇది నీకు యివ్వటానికి వచ్చాను" చెయ్యి ముందుకు జాపాడు.

లేత పసుపచ్చరాయి పొదిగిన ఉంగరం! ఒకనాడు ఎంతో ప్రేమతో తనే స్వయంగా అతని వేలికి తొడిగిన ఉంగరం! "ఇంక నా దగ్గిర అది అనవసరం! నీకే ఎందుకైనా ఉపయోగపడవచ్చు!"

మొదటి వాక్యానికి కరిగిపోయిన రాధ మనసు రెండో వాక్యంతో పదునెక్కింది. ఆ వుంగరం తీసుకుంది. శేఖర్ వెళ్ళిపోయాడు.

కరుణ్ కూతురు బాల వచ్చీ రాని మాటలతో ఎప్పుడూ కరుణ్ చుట్టూ తిరుగుతూ అతనిని వదిలిపెట్టేది కాదు.

స్వర్ణ వెళ్ళిపోయినందుకు కరుణ్ బాధపడకపోలేదు. కానీ బాలను చూడకుండా ఉండలేకపోయాడు. బాలకోసం అభిమానం చంపుకుని అవమానాలకు సిద్దపడి అత్తవారింటికెళ్ళాడు.

అత్తమామలు అతణ్ని చూసి కూడ పలకరించలేదు. స్వర్ణ గదిలోకి వెళ్ళబోయాడు కరుణ్. గది గుమ్మానికి అడ్డుగా నిలబడింది స్వర్ణ. . . కదలలేదు. కరుణ్‌ని లోపలకు రమ్మనలేదు. కూర్చోమనలేదు. ఆ ధోరణి అర్థం చేసుకున్నాడు కరుణ్.

"బాల ఏది?"

"కిటికీలోంచి మీరు రావటం చూసాను. పనిమనిషితో బయటికి పంపించాను"

"అంటే?"

వెటకారంగా నవ్వింది స్వర్ణ "చదువుకున్నవారు మీరు! నాలాంటి మూర్ఖురాలు ఇంతకంటే ఏం చెప్పగలదు?"

తనే ఒక కుర్చీ తెచ్చుకుని గది బయటే కూర్చున్నాడు కరుణ్. స్వర్ణ అలా నిలబడే ఉంది.

"పిలిపించు!" అన్నాడు అధికారికంగా.

"ఎందుకు? అది మిమ్మల్ని ఎంత త్వరగా మరిచిపోతే నాకంత మంచిది!"

"నన్ను పూర్తిగా వదులుకున్నట్లేనా?"

"జాగ్రత్తగా మాట్లాడండి! మీరే నన్ను వదిలారు. నేను దేవిరించటం లేదు!"

"ఆలోచించే మాట్లాడుతున్నావా?"

"ఏమిటీ - మీరు..... నన్ను.... ఆలోచించమంటున్నారా? ఆహా! ఆలోచించాను.... అన్ని విషయాలు చాలా బాగా ఆలోచించుకున్నాకే ఈ నిర్ణయానికి వచ్చాను. మొగుడు లేనంత మాత్రాన నాకు మునిగిపోయింది లేదు కనుసైగ చేస్తే చాలు కుక్కల్లా వచ్చి క్యూలో నిలబడతారు, మిమ్మల్ని మించిన ప్రణయోపాసకులు!"

"ఛీ! ఛీ! ఎంత దారుణంగా మాట్లాడుతున్నావ్! మా ప్రేమను అర్థం చేసుకోకుండా..."

"లేదు! లేదు! అర్థం చేసుకున్నాను. లైలా మజ్నూలను పార్వతీ దేవదాసులను.... అనార్కలీ సలీంలను.... ఇంకా ఇలాంటి వాళ్ళందరినీ మించిపోయిన పవిత్రప్రేమ. అలాంటి పవిత్ర ప్రేమ.... నా బిడ్డ బ్రతుకును నలుగురిలో నవ్వులపాలు చేసుకునే ప్రేమ అలాంటి ప్రేమ

నాకక్కర్లేదు. ఆ మహా ప్రణయోపాసకులు మీరే! మీ యశస్సు భూనభోంతరాళాలు నిండి జ్వలించిపోతూంది. ఆ జ్వాలల్లో నా పాప మాడిపోకుండా కాపాడుకోవటమే నాకు కావాలి, నా పాపచుట్టూ కంచుకోటలా నిలవటానికి ఏదైనా వదులుకుంటాను. ఎంతైనా సహిస్తాను."

స్వర్ణ మాటల్లో నిర్లక్ష్యం మాత్రమే తెలిసింది కరుణ్‌కి. ఆ తరువాత ఆమె కిటికీ చువ్వలు పట్టుకుని కనుమరుగయ్యేంతవరకూ చూడటం తెలియదు. భరింపరాని బాధతో ఉబికిన ఆమె కన్నీరు దానిని వెన్నంటి వచ్చిన రోషాగ్ని కీలల్లో ఆవిరి కావటం తెలియదు.

కరుణ్ ముఖం చూడగానే ఏదో జరగరానిది జరిగిందని అర్థంచేసుకుంది రాధ.... కానీ అదేమిటని అడగలేకపోయింది. ఏం జరిగినా కారణం తనే!

"నీ వల్ల నాకీ అవమానం జరిగింద"ని కరుణ్ చెప్పాడు.

గంగా భాగీరథీ సమానురాలు సుబ్బాయమ్మగారు - అక్కడి మాటలిక్కడా, ఇక్కడి మాటలక్కడా జేరవెయ్యటంలో..... లేనివి కల్పించి చెప్పటంలో.... పనికట్టుకుని మనసుని పొడిచేలా మాట్లాడడంలో ఆవిడకావిడే సాటి.

రెండు గంటలవేళ గుండె బాదుకుంటూ వచ్చింది ఆవిడ రాధ దగ్గిరకి....

"ఇంకేముంది రాధమ్మ తల్లీ అంతా ముగిసిపోయింది నా తల్లీ! శేఖర్ చచ్చిపోయాడు రాధమ్మా!" అని దీర్ఘాలు తీసేస్తోంది.

అదిరిపడింది రాధ.

"శేఖర్ చచ్చిపోయాడా? నిన్నటివరకూ బాగానే ఉన్నాడు..."

"నిన్నటివరకూ కాదే నా తల్లీ! గంటక్రిందటి వరకూ బాగానే ఉన్నాడు... ఇప్పుడే కారు ఏక్సిడెంట్ అయింది. శేఖర్ కారు లారీని గుద్దేసింది. నా కళ్ళారా చూసాను..."

రక్తం బొట్టు లేనట్లు పాలిపోయింది రాధ ముఖం. ఆ ముఖం చూసి తృప్తిపడిన సుబ్బాయమ్మ దీర్ఘాలు ఆపేసింది.

స్థిమితంగా మాట్లాడటం మొదలుపెట్టింది...."అవునే అమ్మడూ! ఇంతకూ నీకు - పసుపూ కుంకం పోయినట్లా? ఉన్నట్టా?" అని ధర్మ సందేహం ప్రకటించింది.

రాధ చీదరగా చూసి కోపంగా ముఖం తిప్పుకోవటంతో ఆవిడకు హుషారొచ్చింది. మరి కాస్త రసవత్తరంగా మళ్ళీ మొదలుపెట్టింది.... "ఇది విన్నావా! అది ఏక్సిడెంట్ కాదనీ, శేఖర్ కావాలనే తన కారును లారీకి గుద్దించాడనీ చెప్పుకుంటున్నారు. ఏం కాలమమ్మా చావడానికి కూడా కొత్త కొత్త మార్గాలు! భలే!భలే!" అని కొంతసేపు తన హుషారు ప్రకటించిన సుబ్బాయమ్మ అంతలో అసలు విషయం గుర్తొచ్చి విచారంగా "అవునమ్మా! హాయిగా వున్న మగ మహారాజు కట్టుకున్న పెళ్ళాం కళ్ళ ముందు మరోడితో కాపురం చేస్తోంటే చూసి ఎలా సహిస్తాడు? ఆ నరకం కంటే ఈ చావు మేలు కాదు మరీ...." అని వ్యాఖ్యానించింది.

రాధ ముఖం భంగిమలు చూడాలని ముచ్చటపడి పరిశీలనగా చూసింది. కానీ అప్పటికే రాధ స్పృహ తప్పి పడిపోయింది. సుబ్బాయమ్మ కంగారుపడి పారిపోయింది.

కరుణ్ వచ్చేసరికి రాధ అలాగే స్పృహ తప్పి పడిఉంది. ఆరేళ్ళ బాబు బిక్కుబిక్కుమంటూ చూస్తున్నాడు. కరుణ్‌కి మతిపోయినట్లయింది.

“రాధా! రాధా!” అని పిలిచాడు. ముఖంమీద చన్నీళ్ళు జల్లాడు. స్మెల్లింగ్ సాల్ట్‌వాసన చూపించాడు. రాధ కళ్ళు తెరిచింది.... కరుణ్ కనిపించాడు.

అంతలోనే ఎక్కడినుండో శేఖర్ స్వరం మనసును మెలిపెడుతూ వినిపించింది “నిన్ను ప్రేమిస్తున్నాను రాధా! నిన్ను వదలలేను రాధా! వదలను.... వదలను.... నిన్ను వదలలేను రాధా! నిన్ను వదలను.....”

రాధ మళ్ళీ స్పృహ తప్పిపోయింది. బాబు ఏమీ అర్ధం కాక - వెక్కి వెక్కి ఏడ్చేశాడు. కరుణ్ బాబును దగ్గిరకు తీసుకోవాలని ఒక్క అడుగు ముందుకేశాడు. బాబు వెనక్కు తగ్గాడు. కోపంగా చూసాడు, అమాయకంగా ఉన్నాడు.

“డాడీ ఉంటే మమ్మీని ఇలా పడిపోనియ్యరు”

గతుక్కుమన్నాడు కరుణ్ - అమాయకంగా పసివాడి నోట వచ్చిన ఆ మాట సార్వజనీన జీవిత సత్యమా? సమకాలిన సాంఘిక సత్యమా? లేక ఈ రెంటినీ అనుసంధించే అద్భుత సమన్వయమా?

ఎప్పటికీ కళ్ళు తెరిచింది రాధ. ఎదురుగా శేఖర్.... ఒక్కసారిగా రాధ ముఖం వికసించింది. శేఖర్ భుజం మీద ఉన్న బాబు ముఖమూ వికసించింది.

ఈ లోకంలో మంచి చెడ్డలు లేవు. పాప పుణ్యాలు లేవు. కానీ ఏనాటికీ ఎవరూ కాదనలేని అంతరాత్మ మాత్రం ఉంది. అపరాధ భావనతో నలిపే అంతరాత్మను పెట్టుకొని జీవించవలసి రావటం నరకాలన్నింటిలో నరకం.

“నువ్వు శేఖర్‌ను చంపావు. ఒక ప్రాణం పొట్టన పెట్టుకున్నావు. ఒక నిండు జీవితాన్ని బలితీసుకున్నావు....” అని అంతరాత్మ ఘోష పెడుతోంటే.... ఆ ఘోషకు మనసు మొద్దుబారిపోయి సమస్త చైతన్యమూ నశించిపోతోంటే ఎన్నాళ్ళు తనలా పడిఉందో? అబ్బ! ఎంత రిలీఫ్!

శేఖర్ చిరునవ్వుతో ఉల్లాసంగా మాట్లాడుతున్నాడు “స్పృహ లేకుండా నువ్వు ఎన్నాళ్ళు హాస్పిటల్లో వున్నావో తెలుసా? వారం రోజులు! నా చావు అబద్ధం - నీ చావు నిజం అనుకున్నాను. నేను చచ్చిపోయానని విని - అది తట్టుకోలేక నువ్వు చచ్చిపోతే - నేనెలా తట్టుకోగలనురా భగవంతుడా! - అనుకున్నాను!”

పకాలున నవ్వింది రాధ -

మనసు చికాగ్గా ఉన్న మీదట ఇలాంటి వార్త వినేసరికి మెంటల్ షాక్ వచ్చిందన్నాడు డాక్టర్ - క్షమించు రాధా! కల్పించుకోవాలని కల్పించుకోలేదు. నీ పరిస్థితి చూసాక.... ఆ పరిస్థితికి పరోక్షంగా కారణం నేనని తెలిసాక నిన్నిలా వదిలెయ్యలేకపోయాను" మధ్యలో ఆగిపోయి అదోక రకంగా చూశాడు శేఖర్. ఆ చూపులలో అడగలేని అనేక ప్రశ్నలు!

నీమనసు చికాగ్గా ఉందా? ఎందుకుంది? అంత చికాగ్గా ఉన్నప్పుడు అక్కడెందుకున్నావు? లాంటి ప్రశ్నలు, తన మనసు చికాకు పడిందా? తనకు తెలీదు! తను తపించిపోయిన కరుణ్ సాన్నిధ్యం దొరికింది. నిజమే? కానీ వడిలిపోయిన బాబు ముఖం! అది చూడలేకపోయేది. కరుణ్ దగ్గిరకు తీయబోయినా బాబు వెళ్ళేవాడుకాదు. కోపంగా చూసేవాడు. ఆ కోపం పోగొట్టి లాలించి బుజ్జగించి ఆడించే ఓపిక కరుణ్‌కి లేదు. పైపెచ్చు బాబు తిరస్కారం అతని మనసును గాయపరిచేది. ఆ తిరస్కారం ప్రకటిస్తున్నది ఆరేళ్ళ అమాయక ప్రాణి అనే విషయం గుర్తుకురాలేదు.

తరచుగా బాల ఫొటోముందు నిలబడి నిట్టూర్పు విడిచేవాడు కరుణ్. రాధను చూడగానే ఏదో తప్పు చేసిన వాడిలా వెళ్ళిపోయేవాడు. అపరాధిలా ముడుచుకుపోయేది రాధ.

రాధ హాస్పిటల్‌లో ఉండగా కరుణ్‌కూడా వచ్చేవాడు. శేఖర్ ఏమీ మాట్లాడేవాడు కాదు. కాని అతడు రాగానే లేచి వెళ్ళిపోయేవాడు. రాధ ఎవరితోనూ ఏమీ మాట్లాడేది కాదు. నీరసంగా ఉన్నట్లు కళ్ళు మూసుకుని పడుకునేది.

రాధ పూర్తిగా కోలుకుంది. ఆ మరునాడు వెళ్ళిపోవచ్చునని డాక్టర్ చెప్పాడు...

"రాధా!" దీనంగా పిలిచాడు శేఖర్-

ఏమిటన్నట్లు చూసింది రాధ.

"మన కంపెనీ హెడ్డాఫీస్ బెజవాడకు మార్చి దీనిని బ్రాంచ్‌గా చేసాను. బెజవాడకు వెళ్ళిపోవాలనుకుంటున్నాను."

రాధ మాట్లాడలేదు.

"నువ్వూ వస్తావా రాధా!"

ఉలిక్కిపడింది రాధ. అభిమానానికీ, పౌరుషానికీ మారు పేరయిన శేఖర్ ఇలా దీనాతి దీనంగా ప్రాధేయపడుతున్నాడు.

"ప్లీజ్ రాధా! బాబు కోసం!"

కళకళలాడుతూ కేరింతలు కొడుతూ తండ్రి మెడచుట్టూ చేతులు వేసిన బాబును చూసింది రాధ. అలా వాడి ముఖం చూసి ఎన్నాళ్ళయిందో?

దిండులో ముఖం దాచుకుంది. దిండులోంచే అంది.

"వస్తాను"

రాధ మనసు ఏ క్షణంలో ఎలా మారుతుందో అన్నట్లు చక చక ప్రయాణపు ఏర్పాట్లు పూర్తి చేసాడు శేఖర్.

బయలుదేరే రోజు వచ్చింది.

"నన్నొక్కసారి స్వర్ణ దగ్గరకి తీసికెళ్తారా?" అడిగింది రాధ.

ఉలిక్కిపడ్డాడు శేఖర్.

"స్వర్ణ దగ్గిరకా"

"అవును"

"అలాగే!"

"ఒక మంచి పట్టుచీర, దానిమీదికి జాకెట్ కూడా తీసుకురండి!"

"అలాగే!"

అన్నింటికీ 'అలాగే' అంటోన్న శేఖర్‌ని చూస్తే జాలేసింది రాధకి. భరించలేనట్టు తల తిప్పుకుంది.

కారులో దిగిన శేఖర్ దంపతులను చూసి తెల్లబోయారు స్వర్ణ తల్లిదండ్రులు. సంభ్రమంతో సగౌరవంగానే ఆహ్వానించారు.

స్వర్ణ వచ్చింది. కొయ్యబొమ్మలా నిలబడింది. తల ఎత్తి స్వర్ణను చూడడానికీ మాట్లాడడానికీ శక్తినంతా కూడదీసుకుంది రాధ.

"స్వ ర్ణా నేను వెళ్ళిపోతున్నాను - ఇది..... నీకు బొట్టుపెట్టి ఇయ్యాలని వచ్చాను."

రాధ లేచింది. స్వర్ణకు బొట్టుపెట్టి పట్టుచీర చేతిలో పెట్టింది.

"వెళ్ళొస్తానమ్మా" అంది.

అకస్మాత్తుగా స్వర్ణ రాధను కౌగిలించుకుని బావురుమంది.

చెమ్మగిల్లిన కళ్ళతో స్వర్ణభుజం తట్టింది రాధ.

ఎప్పటినుండో కరుణ్ రోడ్డుమీద పడిగాపులు పడుతూ నిల్చున్నాడని తెలుసు. అయినా అటు తల తిప్పలేదు. అతని నొక్కసారి కూడా చూడలేదు.

బాబు చెయ్యి పట్టుకుంది. కారులో వచ్చి కూర్చుంది. కారు కదిలింది.

ఈ దారినుండి పొంగుతున్నది స్వరాలకు లొంగని - శ్రుతులకందని - మోహనగానం -

ఆ దరినుంచి వినవస్తున్నది.

అద్భుత స్వర్గ సమ్మేళనంలో..... శ్రుతిబద్ధమైన ప్రణవ నాద మాధురి.

ఈ అద్యంతాల నడుమ ఉయ్యాల లూగుతున్నది చైతన్యం, ప్రాణుల ప్రణయ లాస్యాలతో ప్రణయ హాస్యాలతో.... ఇదే నిరంతర మధుర విషాదగీతి - విశ్వగీతి.

--0--